aruhi
aruhi group
BBTV
BBTV TELUGU
BBTV NETWORK

www.mahaaprabha.com

నమస్తే

మహాప్రభ

ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ

తెలుగు దినపత్రిక

శుక్రవారం
13-11-2026
సంపుటి : 01 సంచిక :230 పేజీలు : 08 వెల : ₹ 5/-

BESQATI
www.besqati.com
besqati.com
Contact : info@besqati.com

Published From RANGAREDDY,TELANGANA. తెలంగాణ NAMASTEY MAHAAPRABHA TGTEL/26/A0738 mahaaprabha.com Email : info@mahaaprabha.com

పాక్‌లో ఉగ్రవాదుల భీకర దాడి.


- పోలీసు కాన్వాయ్‌ను లక్ష్యంగా చేసుకుని మెరుపుదాడి
- ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లో ఘటన
- ఎదురుకాల్పుల్లో 18 మంది ఉగ్రవాదులు హతం
- మరో 12 మంది పోలీసులకు తీవ్ర గాయాలు
- కోహాట్ జిల్లాలోని గుంబత్ ప్రాంతంలో దాడి
- అక్రమ బంగారు తవ్వకాల వ్యతిరేక ఆపరేషన్ ముగించుకుని వస్తుండగా దాడి
- దాడికి బాధ్యత ప్రకటించుకున్న టీటీపీ
- ఉగ్రవాదంపై పోరాటం కొనసాగుతుందని పాక్ ప్రభుత్వం స్పష్టీకరణ


03

ఎలాంటి ముప్పునైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి

- యుద్ధాల తీరు మారుతోంది.. కొత్త సవాళ్లకు సిద్ధం కావాలి
- సైన్యానికి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పిలుపు
- ఆకస్మిక దాడులు నిర్వహించే సామర్థ్యాలను పెంచుకోవాలని సూచన
- నిఘా, పర్యవేక్షణ వ్యవస్థలను బలోపేతం చేయాలని ఆదేశం
- డ్రోన్లు, ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థల ప్రాధాన్యతపై ప్రస్తావన
- సైబర్, అంతరిక్ష యుద్ధాలపై ప్రత్యేక వ్యూహాలు రూపొందించాలని సూచన


03




తెలంగాణలో భారీగా ఐపీఎస్
అధికారుల బదిలీ

- రాష్ట్రవ్యాప్తంగా 21 మంది ఐపీఎస్‌ల బదిలీ
- హైదరాబాద్ కొత్త పోలీస్ కమిషనర్‌గా మహేశ్ భగవత్
- ఫైర్ సర్వీసెస్ డీజీగా వీసీ సజ్జనార్‌కు బాధ్యతలు
- లా అండ్ ఆర్డర్ అదనపు డీజీపీగా అకున్ సబర్వాల్
- మహిళా భద్రత విభాగం డీజీపీగా సౌమ్య మిశ్రా
- జైళ్ల శాఖ డీజీగా స్వాతి లక్రా నియామకం
- ఏసీబీ డీజీగా చారు సిన్హా.. సీఐడీ బాధ్యతలూ అప్పగింత
- టీజీఎస్ఆర్టీసీ ఎండీగా డా. అనిల్ కుమార్
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఉత్తర్వులు జారీ

హైదరాబాద్ నవంబర్ 12(మహాప్రభ)
తెలంగాణ పోలీస్ శాఖలో ప్రభుత్వం భారీగా ఐపీఎస్ అధికారుల బదిలీలు చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా 21 మంది అధికారులకు కొత్త బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. లా అండ్ ఆర్డర్, ఏసీబీ, సీఐడీ, మహిళా భద్రత, ట్రాఫిక్, ఇతర కీలక విభాగాల్లో మార్పులు చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జీఓ ఆర్టీ నంబర్ 1654ను విడుదల చేశారు. ఇప్పటివరకు డీజీపీ (లా అండ్ ఆర్డర్)గా ఉన్న మహేశ్ మురళీధర్ భగవత్‌ను హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్‌గా

-మిగతా 3 లో


03

కీలక ఖనిజాల వేటలో
భారత్ దూకుడు..

- కీలక ఖనిజాల కోసం 15 అంతర్జాతీయ ఒప్పందాలు చేసుకున్న భారత్
- 41 ఒప్పందాలతో అగ్రస్థానంలో కొనసాగుతున్న అమెరికా
- చైనా, కెనడా, ఈయూ కంటే వేగంగా భారత్ ముందడుగు
- నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్‌తో పటిష్ఠమైన చర్యలు
- అర్జెంటీనా, ఆస్ట్రేలియాలతో లిథియం తవ్వకాలకు భాగస్వామ్యం


03

స్వచ్ఛ నగరాల్లో నవీ ముంబైకి
అగ్ర స్థానం

జూన్ 2 నాటికి టిమ్స్‌లు
కంప్లీట్

ప్రజలకు పూర్తిస్థాయి సేవలందించాలి

- ఏడాదిలో ఉస్మానియా కొత్త భవనాలు ప్రజలకు అందాలి
- 3 టిమ్స్‌లకు ఏకీకృత నియామకాలు
- నిమ్స్... టిమ్స్‌ల మధ్య సమన్వయం ఉండాలి
- వైద్యులు, సిబ్బంది నియామక ప్రక్రియ వేగవంతం చేయండి
- వైద్య, ఆరోగ్య శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

03

జూన్ 2 నాటికి అల్వాల్, ఎల్‌బీనగర్ టిమ్స్‌లు, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, నిమ్స్ విస్తరణ పనులు పూర్తి చేసి ప్రజలకు పూర్తిస్థాయి వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. వచ్చే ఏడాది డిసెంబరు నాటికి నూతన ఉస్మానియా ఆసుపత్రిని కూడా అందుబాటులోకి తేవాలని స్పష్టం చేశారు. ఆసుపత్రుల నిర్మాణం, వైద్య పరికరాల కొనుగోలు, వైద్యులు, సిబ్బంది నియామకాలను సమాంతరంగా వేగవంతం చేయాలని సూచించారు. మూడు టిమ్స్‌లలో ఏకీకృత నియామక విధానం అమలు చేయడంతోపాటు నిమ్స్, టిమ్స్‌ల మధ్య సమన్వయం పెంచాలని ఆదేశించారు. వైద్యారోగ్య శాఖపై నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షలో సీఎం ఈ కీలక నిర్ణయాలు వెల్లడించారు.



బీజేపీ, ఆరెస్సెస్ విదేశీ అంటూ నా తల్లిని విమర్శించాయి :

- విదేశీయురాలంటూ ఏళ్ల తరబడి విమర్శలు గుప్పించారని ప్రియాంక ఆవేదన
- తన జీవిత వాస్తవాలను పుస్తకంలో వెల్లడించే హక్కు సోనియాకు ఉందని స్పష్టీకరణ
- ఇన్నాళ్లూ విమర్శలకు స్పందించకుండా సోనియా మౌనంగా ఉన్నారని వెల్లడి
- 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' ద్వారా వాస్తవాలను ప్రజల ముందుంచారని వ్యాఖ్య
- గతంలో అబద్ధాలు ప్రచారం చేసినవారే ఇప్పుడు ఆ పుస్తకాన్ని చదువుతున్నారని ఎద్దేవా

03





మరో తుపాన్
ముప్పు

- నేడు అల్పపీడనం ఏర్పడే అవకాశం
- 24 గంటల్లో వాయుగుండంగా బలపడే సూచనలు
- ఆ తర్వాత తుపాన్‌గా మారే అవకాశముందని అంచనా
- ఉత్తర తమిళనాడు, దక్షిణ కోస్తా వైపు పయనం
- ఏపీ, తెలంగాణలో మూడు నాలుగు రోజులు వర్షాలు
- దక్షిణ కోస్తా, రాయలసీమలో ఈదురుగాలులతో వానలు
- తెలంగాణలో 2--3 డిగ్రీలు తగ్గనున్న ఉష్ణోగ్రతలు

హైదరాబాద్:నవంబర్ 12(మహాప్రభ)
బంగాళాఖాతంలో మరో తుపాన్ ముప్పు పొంచి ఉన్నది. శుక్రవారం దక్షిణ అండమాన్ సముద్రంలో అల్పపీడనం ఏర్పడే అవకాశముందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఏర్పడే ఈ అల్పపీడనం రానున్న 24 గంటల్లో ఆగ్నేయ బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడే సూచనలు ఉన్నాయని అధికారులు తెలిపారు. అనంతరం తుపాన్‌గా మారే అవకాశముందని అంచనా వేస్తున్నారు. తుపాన్‌గా రూపాంతరం చెందితే ఉత్తర తమిళనాడు, దక్షిణ కోస్తాంధ్ర తీరాల వైపు పయనించే అవకాశం ఉన్నదని వాతావరణ శాఖ భావిస్తున్నది. దీని ప్రభావంతో రాబోయే మూడు నాలుగు రోజుల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశమున్నది. ముఖ్యంగా దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన

-మిగతా 3 లో

నేటి నుంచి భారత్ సమ్మిట్

రెండు రోజుల పాటు జరగనున్న అంతర్జాతీయ సదస్సు

- ప్రపంచ ప్రగతిశీల శక్తులకు హైదరాబాద్ వేదిక
- భారత్‌తో పాటు 70 దేశాల ప్రతినిధుల హాజరు
- సుమారు వెయ్యి మంది ప్రతినిధులతో కీలక చర్చలు
- ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయంపై ప్రధానంగా చర్చ
- వాతావరణ మార్పులు, ఏఐ, ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై సమాలోచనలు
- 14న ముగింపు సమావేశంలో రాహుల్‌గాంధీ ప్రసంగం
- రాష్ట్ర అభివృద్ధిపై ప్రత్యేకంగా తొమ్మిది సమావేశాలు


హైదరాబాద్ నవంబర్ 12(మహాప్రభ)
ప్రపంచవ్యాప్తంగా ప్రగతిశీల భావజాలం కలిగిన రాజకీయ నాయకులు, మేధావులు, విధాన రూపకర్తలతో అంతర్జాతీయ స్థాయి చర్చలకు హైదరాబాద్ వేదిక కానుంది. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో గురు, శుక్రవారాల్లో హెచ్‌ఐసీసీలో రెండో భారత్ సమ్మిట్--2026 నిర్వహించనున్నారు. భారత్‌తో పాటు సుమారు 70 దేశాల నుంచి వెయ్యి మంది ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరుకానున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో

-మిగతా 3 లో





ప్రెస్ రిలీజ్‌ల కాలం పోయింది..
ఇప్పుడంతా ఇన్‌స్టా రీల్స్..!


03

- మీడియాతో తనకు సుదీర్ఘ అనుబంధం ఉందన్న ప్రధాని మోదీ
- జర్నలిజంలో సాంకేతికంగా ఎన్నో మార్పులు వచ్చాయని వ్యాఖ్య
- ఒకప్పుడు ఓబీ వ్యాన్లు.. ఇప్పుడు మొబైల్ ఫోన్లే బ్రాడ్‌కాస్ట్ వాహనాలు
- గతంలో పత్రికా ప్రకటనలు.. ఇప్పుడు ఇన్‌స్టా రీల్స్ ద్వారా సమాచారం
- విపత్తులు, సంక్షోభాల్లో జర్నలిస్టుల కృషి అభినందనీయం
- 12 ఏళ్లలో 50 కోట్ల మందిని పేదరికం నుంచి బయటపడేశాం
- దేశ విజయగాథలను ప్రపంచానికి చాటిచెప్పాలని మీడియాకు పిలుపు

ముంబైలో బాంబు బెదిరింపుల కలకలం..



ముంబై:నవంబర్ 12(మహాప్రభ)

దేశ ఆర్థిక రాజధాని ముంబైలో బాంబు బెదిరింపు ఈ-మెయిల్స్ తీవ్ర కలకలం రేపాయి. నగరంలోని అత్యంత కీలకమైన ప్రాంతాలతో పాటు బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ బచ్చన్ నివాసాన్ని బాంబులతో పేల్చివేస్తామంటూ గుర్తుతెలియని దుండగులు బెదిరింపు మెయిల్స్ పంపారు. ఈ మెయిల్‌లో ముంబై మేయర్ కార్యాలయం మరియు ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని కూడా లక్ష్యంగా చేసుకున్నట్లు హెచ్చరించారు. బెదిరింపు ఈ-మెయిల్ అందిన వెంటనే ముంబై పోలీసు ఉన్నతాధికారులు, భద్రతా ఏజెన్సీలు పూర్తిస్థాయిలో అప్రమత్తమయ్యాయి. ముందుజాగ్రత్త చర్యగా బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్ , డాగ్ స్క్వాడ్ బృందాలు అమితాబ్ బచ్చన్ నివాసం 'జల్సా'తో పాటు మేయర్ కార్యాలయం, విమానాశ్రయ పరిసరాల్లో విస్తృత తనిఖీలు చేపట్టాయి. ఎక్కడా ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లభించకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. మరోవైపు, ఈ బెదిరింపు మెయిల్ ఎక్కడి నుంచి వచ్చింది? దీని వెనుక ఎవరున్నారనే కోణంలో ముంబై సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి ఐపీ అడ్రస్ ఆధారంగా దర్యాప్తు ముమ్మరం చేశారు.

తమిళనాడులో భారీ చోరీ..

-తనిష్క్ షోరూమ్‌లో రూ.50 కోట్ల నగలు అపహరణ

మదురై:నవంబర్ 12(మహాప్రభ)



తమిళనాడులోని మదురై నగరంలో భారీ దోపిడీ కలకలం రేపింది. కలవాసల్ బైపాస్ రోడ్డు (పళంగనాథం ప్రాంతం) సమీపంలో కొత్తగా ప్రారంభమైన ప్రముఖ జ్యువెలరీ సంస్థ 'తనిష్క్' షోరూమ్‌లో గుర్తుతెలియని దుండగులు అర్ధరాత్రి చొరబడి సుమారు రూ.50 కోట్ల విలువైన బంగారు, వజ్రాభరణాలను అపహరించారు. పోలీసులు మరియు షోరూమ్ నిర్వాహకులు తెలిపిన వివరాల ప్రకారం, ఈ షోరూమ్‌ను ప్రారంభించి కేవలం 10 నుంచి 15 రోజులు మాత్రమే అవుతోంది. భవన నిర్మాణ పనులు ఇంకా పూర్తిస్థాయిలో ముగియకముందే ఇటీవల దుకాణాన్ని ప్రారంభించారు. రాత్రి సిబ్బంది యథావిధిగా షోరూమ్‌కు తాళాలు వేసి వెళ్లిన తర్వాత, అర్ధరాత్రి సమయంలో దుండగులు షట్టర్ మరియు వెనుక వైపు తలుపులను పగలగొట్టి లోపలికి ప్రవేశించారు. షోరూమ్‌లోని సుమారు 16 కిలోల బంగారు ఆభరణాలు, వజ్రాలను సంచుల్లో నింపుకుని పరారయ్యారు. ఉదయం షోరూమ్ తెరిచేందుకు వచ్చిన సిబ్బంది తలుపులు పగలగొట్టి ఉండటం, లోపల ఆభరణాలు మాయమవడం గమనించి వెంటనే నిర్వాహకులకు, పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న మదురై నగర పోలీసు ఉన్నతాధికారులు, క్లూస్ టీమ్ మరియు డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. సీసీటీవీ ఫుటేజీలో ముసుగులు ధరించిన ముగ్గురు వ్యక్తులు సంచులతో వెళ్తున్న దృశ్యాలు రికార్డయినట్లు గుర్తించారు. నిర్వాహకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు, నిందితులను పట్టుకునేందుకు మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు.

పట్టాలెక్కిన అత్యాధునిక 'అమృత్ భారత్ 3.0'



న్యూఢిల్లీ: నవంబర్ 12(మహాప్రభ)

ఛత్ పూజ పండుగ రద్దీని తట్టుకుని ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు భారతీయ రైల్వే శాఖ అత్యాధునిక 'అమృత్ భారత్ 3.0' రైలును పట్టాలెక్కించింది. న్యూఢిల్లీ రైల్వే స్టేషన్ నుంచి పాట్నాకు ఈ తొలి రైలు సర్వీసును రైల్వే అధికారులు ప్రారంభించారు. నవంబర్ 11వ తేదీ అర్ధరాత్రి ఈ రైలు తన తొలి ప్రయాణాన్ని ప్రారంభించిందని రైల్వే వర్గాలు వెల్లడించాయి. ముఖ్యంగా సామాన్య మరియు మధ్యతరగతి ప్రయాణికుల సౌకర్యార్థం తక్కువ ధరలో అత్యుత్తమ ప్రయాణ అనుభూతిని అందించేలా ఈ రైలును ప్రత్యేకంగా డిజైన్ చేశారు. ఇందులో ఉపయోగించిన అత్యాధునిక పుష్-పుల్ టెక్నాలజీ వల్ల రైలు వేగంగా ప్రయాణించడమే కాకుండా, ప్రయాణికులకు ఎలాంటి కుదుపులు లేని సాఫీ ప్రయాణం అందుబాటులోకి వచ్చింది. వీటితో పాటు మెరుగైన సస్పెన్షన్ వ్యవస్థ, ఆధునిక టాయిలెట్లు, ప్రతి సీటు వద్ద మొబైల్ ఛార్జింగ్ పాయింట్లు వంటి అత్యాధునిక వసతులను ఇందులో కల్పించారు. పండుగ వేళ స్వగ్రామాలకు వెళ్లే ప్రయాణికులకు ఈ కొత్త రైలు ఎంతో ఊరటనిస్తుందని రైల్వే శాఖ పేర్కొంది.

మోదీని మెచ్చుకున్న పిట్రోడా.. దివాళీ విషెస్ చెప్పిన ప్రధాని



న్యూఢిల్లీ నవంబర్ 12(మహాప్రభ)

ప్రధాని మోదీ పై కాంగ్రెస్ పార్టీ ఓవర్‌సీస్ నేత సామ్ పిట్రోడా ప్రశంసలు కురిపించారు. మోదీతో తనకు వ్యక్తిగతంగా మంచి రిలేషన్ ఉందని తెలిపారు. సోషల్ మీడియాలో పోస్టు చేసిన పిట్రోడా వీడియోకు మోదీ స్పందించారు. కాంగ్రెస్ నేత సామ్ పిట్రోడాకు దీపావళితో పాటు గుజరాతీ న్యూ ఇయర్ గ్రీటింగ్స్ చెప్పారు ప్రధాని. సామ్ భాయ్, అంజనా బెన్‌కు విషెస్ చెబుతున్నట్లు మోదీ పేర్కొన్నారు. సంతోషకర, ఆరోగ్యకరమైన సంవత్సరాన్ని జరుపుకోవాలని మోదీ తన ఎక్స్‌లో కోరారు.మోదీ తనకు గుజరాతీ ఫ్రెండ్ అని పిట్రోడా చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోను ప్రధాని తన ఎక్స్‌లో పోస్టు చేశారు. ఆ వీడియోలో సామ్ పిట్రోడా మాట్లాడుతూ.. ప్రధాని మోదీ తనకు గుజరాతీ ఫ్రెండ్ అని, వ్యక్తిగా ఆయన్ను గౌరవిస్తాను, నేను నా భర్య ఆయన్ను కలిసేవారమని, ఆయన ఎంతో ప్రేమ, దయ ప్రదర్శించేవారని, ఆయనో మంచి వక్త, హార్డ్ వర్కింగ్ వ్యక్తి, అని అన్నారు. తమ మధ్య ఎటువంటి వ్యక్తిగత విబేధాలు లేవని పిట్రోడా తెలిపారు.

ఉత్తర కొరియా రాజ్యాంగంలో చారిత్రాత్మక మార్పులు..



న్యూఢిల్లీ: నవంబర్ 12(మహాప్రభ)

సంచలన నిర్ణయం తీసుకున్నారు. దేశ రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా ఏకంగా 54 ఏళ్ల తర్వాత ఉత్తర కొరియా రాజ్యాంగానికి చారిత్రాత్మక సవరణలు చేశారు. అంతర్జాతీయ రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారిన ఈ రాజ్యాంగ సవరణల్లో ప్రధానంగా మూడు కీలక మార్పులకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా దేశంలోని అత్యంత కీలకమైన అణు ఆయుధాల నియంత్రణ అధికారాన్ని నేరుగా 'స్టేట్ అఫైర్స్ కమిషన్'కు అప్పగించారు. మరోవైపు, ఇప్పటివరకు తమ ప్రధాన శత్రువుగా పరిగణిస్తూ వచ్చిన దక్షిణ కొరియా పట్ల తన వైఖరిని మార్చుకుంటూ, ఇకపై దానిని కేవలం ఒక పొరుగు దేశంగా మాత్రమే గుర్తించేలా రాజ్యాంగంలో సవరణలు చేశారు. వీటితో పాటు దేశంలోని పోలీస్, న్యాయ వ్యవస్థలు మరియు క్యాబినెట్‌పై కిమ్ జోంగ్ ఉన్ తన అధికారిక పట్టును మరింత బిగించారు. అమెరికా నుంచి ఎదురయ్యే ఎటువంటి సైనిక లేదా వ్యూహాత్మక ముప్పునైనా సమర్థవంతంగా తిప్పికొట్టడంతో పాటు దేశంలో తన ఏకఛత్రాధిపత్యాన్ని మరింత సుస్థిరం చేసుకోవడమే కిమ్ ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోందని అంతర్జాతీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

కరీనా లాకెట్‌పై వివాదం.. అండగా హిందూ సంస్థ

- దీపావళి వేడుకల్లో కరీనా ధరించిన పురాతన ఆభరణంపై వివాదం
- ఖురాన్‌లోని 'ఆయత్-ఉల్-కుర్సీ' వాక్యాలు చెక్కిన లాకెట్
- 30 క్యారెట్ల పచ్చల హారాన్ని ధరించిన బాలీవుడ్ నటి
- ఆభరణాలు భోపాల్ రాజకుటుంబ వారసత్వ సంపదగా వెల్లడి
- కరీనా, స్టైలిస్ట్ రియా కపూర్‌కు లీగల్ నోటీసులు
- సోషల్ మీడియా పోస్టులు తొలగించి క్షమాపణ చెప్పాలని డిమాండ్
- అభ్యంతరం వ్యక్తం చేసిన మధ్యప్రదేశ్ కాంగ్రెస్ అధికార ప్రతినిధి
- కరీనాకు మద్దతుగా నిలిచిన హిందూ ఉత్సవ సమితి





న్యూఢిల్లీ నవంబర్ 12(మహాప్రభ)

బాలీవుడ్ నటి కరీనా కపూర్ ఖాన్ ధరించిన ఓ పురాతన లాకెట్ వివాదానికి దారితీసింది. దీపావళి వేడుకల సందర్భంగా ఆమె ధరించిన 30 క్యారెట్ల పచ్చల లాకెట్‌పై పవిత్ర ఖురాన్‌లోని 'ఆయత్-ఉల్-కుర్సీ' వాక్యాలు చెక్కి ఉండటంపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఈ వ్యవహారంలో కరీనాకు లీగల్ నోటీసులు అందగా.. మరోవైపు హిందూ ఉత్సవ సమితి ఆమెకు మద్దతుగా నిలిచింది. దీపావళి వేడుకల కోసం కరీనా ప్రముఖ డిజైనర్ పునీత్ బలానా రూపొందించిన కాఫ్తాన్, తలపాగాను ధరించారు. ఈ సందర్భంగా భోపాల్ రాజకుటుంబానికి చెందిన వారసత్వ ఆభరణాలను అలంకరించుకున్నారు. ప్రముఖ సెలబ్రిటీ స్టైలిస్ట్ రియా కపూర్ ఈ విషయాన్ని ఇన్‌స్టాగ్రామ్‌లో వెల్లడించారు. భోపాల్ బేగంకు చెందిన 30 క్యారెట్ల పచ్చల లాకెట్‌తోపాటు సుమారు 200 ఏళ్ల చరిత్ర కలిగిన కల్గీని కరీనా ధరించారు. ఈ ఆభరణాలు ఆమె భర్త సైఫ్ అలీ ఖాన్ కుటుంబ వారసత్వ సంపదగా వచ్చాయి. సైఫ్ నాయనమ్మ సాజిదా సుల్తాన్ భోపాల్ చివరి నవాబు హమీదుల్లా ఖాన్ కుమార్తె. లాకెట్‌పై ఖురాన్‌లోని రెండో అధ్యాయం సూరా అల్-బఖరాలోని 255వ వచనమైన 'ఆయత్-ఉల్-కుర్సీ' చెక్కి ఉంది. ఈ ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో మధ్యప్రదేశ్ కాంగ్రెస్ అధికార ప్రతినిధి అబ్బాస్ హఫీజ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. తన న్యాయవాది మహమ్మద్ జాఫర్ ద్వారా నవంబర్ 11న కరీనా కపూర్, రియా కపూర్‌లకు లీగల్ నోటీసులు పంపించారు. సంబంధిత పోస్టులను సోషల్ మీడియా నుంచి తొలగించడంతోపాటు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అయితే ఇది తన వ్యక్తిగత నిర్ణయమని, కాంగ్రెస్ పార్టీ వైఖరి కాదని హఫీజ్ స్పష్టం చేశారు. ఇస్లామిక్ సంస్కృతికి చెందిన పవిత్రమైన చారిత్రక ఆభరణాన్ని ఫ్యాషన్ వేదికపై ప్రదర్శించడం ముస్లింల మనోభావాలను దెబ్బతీసిందని ఆయన పేర్కొన్నారు. మరోవైపు, హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు చంద్రశేఖర్ తివారి కరీనాకు మద్దతుగా స్పందించారు. లాకెట్‌ను మెడలో, హృదయానికి దగ్గరగా ధరించడంలో ఎలాంటి అగౌరవం లేదని అన్నారు. కరీనా ఎవరికీ క్షమాపణ చెప్పాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. భోపాల్ రాజకుటుంబానికి కోడలిగా వచ్చిన ఆమెకు కుటుంబ వారసత్వ ఆభరణాలను ధరించే హక్కు ఉందని పేర్కొన్నారు. ఈ విషయంలో సంస్కృతి బచావో మంచ్, హిందూ ఉత్సవ సమితి ఆమెకు అండగా ఉంటాయని వెల్లడించారు.

ఢిల్లీని కమ్మేసిన కాలుష్యం



న్యూఢిల్లీ నవంబర్ 12(మహాప్రభ)

దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం తీవ్రంగానే కొనసాగుతోంది. గురువారం ఉదయం నగర సగటు వాయు నాణ్యత సూచీ (ఏక్యూఐ) 307గా నమోదైంది. దీంతో గాలి నాణ్యత అత్యంత అధ్వాన్నమైన స్థాయికి చేరినట్లు అధికారులు వెల్లడించారు. పలు ప్రాంతాల్లో ఏక్యూఐ 350 దాటగా, కొన్ని ప్రాంతాల్లో 390కు చేరువైంది. కాలుష్య తీవ్రత నేపథ్యంలో ఢిల్లీ-ఎన్‌సీఆర్ పరిధిలో గ్రాప్-3 ఆంక్షలు కొనసాగుతున్నాయి. నిర్మాణ పనులు, దుమ్ము రేపే కార్యకలాపాలపై ఆంక్షలు విధించడంతోపాటు ప్రజా రవాణాను వినియోగించాలని అధికారులు సూచిస్తున్నారు. పిల్లలు, వృద్ధులు, శ్వాసకోశ సమస్యలున్న వారు బయటకు వెళ్లేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరిస్తున్నారు.

జ్ఞానేశ్‌కు వ్యతిరేకంగా 26 నుంచి దేశవ్యాప్త నిరసనలు



న్యూఢిల్లీ నవంబర్ 12(మహాప్రభ)

పండుగల విరామం అనంతరం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్‌కు వ్యతిరేకంగా నవంబర్ 26 నుంచి డిసెంబర్ 20 వరకు దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వివిధ సంస్థల కూటమి 'ఓట్ అధికార్ అగైనెస్ట్ సర్' ప్రకటించింది. రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికులు, ఆదివాసీలు, దళితులు, మైనార్టీలు, విద్యార్థులు, యువత, మహిళలకు అనుబంధంగా పనిచేస్తున్న సంస్థలతో కలిసి ఉమ్మడి నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని కూటమి నిర్ణయించింది. ఢిల్లీకే పరిమితమైన నిరసనలను జిల్లాలు, గ్రామాలకు విస్తరిస్తామని తెలిపింది.

ఇరాన్‌పై దాడికి ఇజ్రాయెల్ సన్నద్ధం?



న్యూఢిల్లీ నవంబర్ 12(మహాప్రభ)

ఇరాన్‌పై మరోసారి సైనిక చర్యకు దిగేందుకు ఇజ్రాయెల్ సన్నద్ధమవుతున్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ మేరకు సైనిక సన్నద్ధతను మరింత పెంచాలని ఇజ్రాయెల్ భద్రతా మంత్రివర్గం సైన్యాన్ని ఆదేశించినట్లు సమాచారం. మరోవైపు తమపై దాడి జరిగితే పరిణామాలు పశ్చిమాసియాకే పరిమితం కావని, అవసరమైతే యూరప్ వరకు విస్తరించేలా ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్ హెచ్చరించింది. అణు కార్యక్రమానికి సంబంధించిన చర్చల్లోనూ ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఇరాన్ వద్ద ఉన్న 60 శాతం శుద్ధి చేసిన యురేనియం నిల్వలను మరో దేశానికి తరలించాలన్న అమెరికా ప్రతిపాదనను టెహ్రాన్ తిరస్కరించింది. దీంతో పశ్చిమాసియాలో మరోసారి యుద్ధ వాతావరణం నెలకొనే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

యూపీలో ఎంఐఎం, ఆజాద్ సమాజ్ పార్టీ పొత్తు



న్యూఢిల్లీ నవంబర్ 12(మహాప్రభ)

2027 ఉత్తర్‌ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఏఐఎంఐఎం, ఆజాద్ సమాజ్ పార్టీ (కాన్షీరాం) కలిసి పోటీచేయాలని నిర్ణయించారు. బీజేపీని అడ్డుకోవడమే లక్ష్యంగా సామాజిక పరివర్తన మోర్చా పేరుతో కూటమిని ఏర్పాటుచేశాయి. వచ్చే ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ చేస్తామని ప్రకటించాయి. చంద్రశేఖర్ ఆజాద్‌ను కూటమి సీఎం అభ్యర్థిగా ప్రకటించాయి.

పాక్‌లో ఉగ్రవాదుల భీకర దాడి.

- పోలీసు కాన్వాయ్‌ను లక్ష్యంగా చేసుకుని మెరుపుదాడి
- ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లో ఘటన
- ఎదురుకాల్పుల్లో 18 మంది ఉగ్రవాదులు హతం
- మరో 12 మంది పోలీసులకు తీవ్ర గాయాలు
- కోహట్ జిల్లాలోని గుంబత్ ప్రాంతంలో దాడి
- అక్రమ బంగారు తవ్వకాల వ్యతిరేక ఆపరేషన్ ముగించుకుని వస్తుండగా దాడి
- దాడికి బాధ్యత ప్రకటించుకున్న టీటీపీ
- ఉగ్రవాదంపై పోరాటం కొనసాగుతుందని పాక్ ప్రభుత్వం స్పష్టీకరణ



ఇస్లామాబాద్:
పాకిస్థాన్‌లో మరోసారి ఉగ్రవాదులు రెచ్చిపోయారు. దేశ వాయవ్య ప్రాంతంలోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లో పోలీసు కాన్వాయ్‌ను లక్ష్యంగా చేసుకుని భీకర దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో 10 మంది పోలీసులు ప్రాణాలు కోల్పోగా, ఎదురుకాల్పుల్లో 18 మంది ఉగ్రవాదులు హతమైనట్లు ప్రావిన్షియల్ అధికారులు వెల్లడించారు. మరో 12 మంది పోలీసు సిబ్బంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. కోహట్ జిల్లాలోని గుంబత్ ప్రాంతంలో అక్రమ బంగారు తవ్వకాలకు వ్యతిరేకంగా చేపట్టిన ఆపరేషన్‌ను ముగించుకుని పోలీసులు తిరిగి వస్తుండగా ఈ దాడి జరిగింది. పోలీసు కాన్వాయ్ ప్రయాణిస్తున్న సమయంలో ఉగ్రవాదులు ఒక్కసారిగా కాల్పులు ప్రారంభించినట్లు ఖైబర్ పఖ్తుంఖ్వా పోలీసులు తమ ప్రకటనలో పేర్కొన్నారు. ముందస్తు ప్రణాళికతోనే కాన్వాయ్‌ను లక్ష్యంగా చేసుకుని దాడి చేసినట్లు తెలుస్తోంది. కాల్పుల అనంతరం ఉగ్రవాదులు రెండు పోలీసు వాహనాలకు నిప్పు పెట్టారు. మరో రెండు పోలీసు వాహనాలతోపాటు ఒక ప్రైవేటు వాహనం గల్లంతైనట్లు అధికారులు వెల్లడించారు. ఈ దాడికి తామే బాధ్యులమని నిషేధిత ఉగ్రవాద సంస్థ తెహ్రీక్-ఏ-తాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ) ప్రకటించుకుంది. ఇదిలా ఉండగా, కోహట్ జిల్లాలోని ఒరక్‌జాయ్ ప్రాంతంలో భద్రతా దళాలు మరో ఆపరేషన్ నిర్వహించాయి. ఈ చర్యలో 10 మంది టీటీపీ ఉగ్రవాదులను హతమార్చినట్లు అధికారులు తెలిపారు. వారి వద్ద నుంచి భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. పోలీసు కాన్వాయ్‌పై జరిగిన దాడిని పాకిస్థాన్ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ, విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ తీవ్రంగా ఖండించారు. ఉగ్రవాదుల దాడులకు భయపడేది లేదని, దేశంలో ఉగ్రవాదంపై పోరాటం నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసుల త్యాగం వృథా కాదని పేర్కొన్నారు. దేశంలో శాంతిభద్రతలను కాపాడేందుకు, ఉగ్రవాదాన్ని అంతమొందించే వరకు భద్రతా దళాల చర్యలు కొనసాగుతాయని ప్రభుత్వ పెద్దలు స్పష్టం చేశారు.

తెలంగాణలో భారీగా ఐపీఎస్
అధికారుల బదిలీ

(మొదటి తరువాయి)



నియమించారు. ఇప్పటివరకు హైదరాబాద్ సీపీగా పనిచేసిన వీసీ సజ్జనార్‌ను తెలంగాణ ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్, ఎమర్జెన్సీ అండ్ సివిల్ డిఫెన్స్ విభాగం డీజీగా బదిలీ చేశారు. అదనంగా స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్‌పీఎఫ్) డీజీ బాధ్యతలు కూడా అప్పగించారు. రాష్ట్ర శాంతిభద్రతల అదనపు డీజీపీగా అకున్ సబర్వాల్‌ను నియమించడంతోపాటు కోఆర్డినేషన్, టెక్నికల్ సర్వీసెస్ బాధ్యతలు కేటాయించారు. డా. సౌమ్య మిశ్రాకు మహిళా భద్రత, షీ టీమ్స్, భరోసా విభాగాల డీజీపీ బాధ్యతలు అప్పగించారు. స్వాతి లక్రాను జైళ్ల శాఖ డీజీగా నియమించి, హోంగార్డ్స్ డీజీపీగా అదనపు బాధ్యతలు ఇచ్చారు. చారు సిన్హాకు ఏసీబీ డీజీతోపాటు సీఐడీ డీజీపీ బాధ్యతలు కేటాయించారు. డా. అనిల్ కుమార్‌ను టీజీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమించారు. మిగతా అధికారులకు కూడా వివిధ విభాగాలు, జోన్లలో కొత్త పోస్టింగ్‌లు ఇచ్చారు.

కీలక ఖనిజాల వేటలో భారత్ దూకుడు..

- కీలక ఖనిజాల కోసం 15 అంతర్జాతీయ ఒప్పందాలు చేసుకున్న భారత్
- 41 ఒప్పందాలతో అగ్రస్థానంలో కొనసాగుతున్న అమెరికా
- చైనా, కెనడా, ఈయూ కంటే వేగంగా భారత్ ముందడుగు
- నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్‌తో పటిష్ఠమైన చర్యలు
- అర్జెంటీనా, ఆస్ట్రేలియాలతో లిథియం తవ్వకాలకు భాగస్వామ్యం



కీలక ఖనిజాల సేకరణలో భారత్ అంతర్జాతీయంగా దూసుకెళ్తోంది. 2025 జనవరి నుంచి ఇప్పటివరకు 15 క్రిటికల్ మినరల్స్ ఒప్పందాలు చేసుకుని ప్రపంచంలో రెండో స్థానంలో నిలిచింది. క్లైమేట్ యాక్షన్ లైవ్ నివేదిక ప్రకారం.. 41 ఒప్పందాలతో అమెరికా మొదటి స్థానంలో ఉండగా, చైనా, కెనడా, సౌదీ అరేబియా, యూరోపియన్ యూనియన్ వంటి దేశాలు 11 ఒప్పందాలతో భారత్ కంటే వెనుకబడ్డాయి. ఎలక్ట్రిక్ వాహనాలు, బ్యాటరీలు, సెమీకండక్టర్లు, విండ్ టర్బైన్ల తయారీకి అవసరమైన లిథియం, కోబాల్ట్, నికెల్, గ్రాఫైట్, రాగి వంటి ఖనిజాల కోసం భారత్ విదేశీ భాగస్వామ్యాలను పెంచుకుంటోంది. ఇందులో భాగంగా కేంద్రం నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్‌ను ప్రారంభించింది. 2030-31 వరకు ఈ కార్యక్రమానికి రూ.16,300 కోట్లు కేటాయించగా, ప్రభుత్వ రంగ సంస్థలు మరో రూ.18,000 కోట్లు పెట్టుబడి పెట్టనున్నాయి. అర్జెంటీనాలోని ఐదు లిథియం బ్లాకుల అన్వేషణతోపాటు ఆస్ట్రేలియాలో లిథియం, కోబాల్ట్ ఆస్తులపై భారత్ దృష్టి సారించింది. జర్మనీ, నార్వేలతో ఖనిజాల ప్రాసెసింగ్, రీసైక్లింగ్ రంగాల్లో సహకారాన్ని విస్తరిస్తోంది.

స్వచ్ఛ నగరాల్లో నవీ ముంబైకి అగ్ర స్థానం

న్యూఢిల్లీ
దేశంలోనే అత్యంత పరిశుభ్రమైన నగరంగా నవీ ముంబై ఘనత సాధించింది. వరుసగా ఎనిమిదేండ్లు అగ్రస్థానంలో నిలిచిన ఇండోర్‌ను ఈసారి వేరే విభాగంలో చేర్చారు. తాజా స్వచ్ఛ సర్వేక్షణ్ 2025-26లో సూరత్, విజయవాడ వరుసగా రెండో, మూడో స్థానాలు దక్కించుకున్నాయి.మధ్యప్రదేశ్ లోని రేవాను అత్యంత పరిశుభ్రమైన నదీతీర పట్టణంగా, రుద్రపూర్‌ను అత్యంత పరిశుభ్రమైన హిమాలయ నగరంగా ఎంపిక చేశారు. 10 లక్షలకు పైగా జనాభా ఉన్న నగరాల విభాగంలో గ్రేటర్ విశాఖపట్నం అగ్రస్థానంలో నిలిచింది.

ఎలాంటి ముప్పునైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి

- యుద్ధాల తీరు మారుతోంది.. కొత్త సవాళ్లకు సిద్ధం కావాలి
- సైన్యానికి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పిలుపు
- ఆకస్మిక దాడులు నిర్వహించే సామర్థ్యాలను పెంచుకోవాలని సూచన
- నిఘా, పర్యవేక్షణ వ్యవస్థలను బలోపేతం చేయాలని ఆదేశం
- డ్రోన్లు, ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థల ప్రాధాన్యతపై ప్రస్తావన
- సైబర్, అంతరిక్ష యుద్ధాలపై ప్రత్యేక వ్యూహాలు రూపొందించాలని సూచన



న్యూఢిల్లీ: యుద్ధాల స్వరూపం వేగంగా మారుతున్న నేపథ్యంలో ఎలాంటి రూపంలో ముప్పు ఎదురైనా సమర్థంగా తిప్పికొట్టేందుకు సర్వసన్నద్ధంగా ఉండాలని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సైన్యానికి పిలుపునిచ్చారు. అవసరమైనప్పుడు ఆకస్మిక దాడులు నిర్వహించే సామర్థ్యాలను కూడా పెంపొందించుకోవాలని సూచించారు. ఢిల్లీలో నిర్వహించిన వైమానిక దళ కమాండర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మారుతున్న యుద్ధ పరిస్థితులకు అనుగుణంగా రక్షణ, ప్రతిదాడుల వ్యూహాలను ఆధునికీకరించుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. శత్రువుల కదలికలను ముందుగానే గుర్తించేలా నిఘా, పర్యవేక్షణ సామర్థ్యాలను నిరంతరం పెంచుకోవాలని రాజ్‌నాథ్ సింగ్ సూచించారు. ముప్పును ముందే పసిగట్టి నష్టం జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని అన్నారు. శత్రువులు ఆకస్మికంగా దాడులకు దిగినా వారి వ్యూహాలకు చిక్కకుండా ముందస్తు సన్నద్ధతతో ఉండాలని పేర్కొన్నారు. మన సైనిక చర్యలు శత్రువుల అంచనాలకు అందని విధంగా ఉండాలని, వారు కోలుకునే అవకాశం ఇవ్వని సామర్థ్యాలను రక్షణ దళాలు అభివృద్ధి చేసుకోవాలని దిశానిర్దేశం చేశారు. ఆధునిక యుద్ధాల్లో చోటుచేసుకుంటున్న మార్పులను వివరిస్తూ ఉక్రెయిన్-రష్యా, ఇజ్రాయెల్-హమాస్ ఘర్షణలను ఆయన ప్రస్తావించారు. ప్రస్తుత యుద్ధాల్లో సంప్రదాయ ఆయుధాలతోపాటు డ్రోన్లు, ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా ఆత్మాహుతి డ్రోన్లు, నిఘా డ్రోన్ల వినియోగం వల్ల భద్రతా దళాలకు కొత్త సవాళ్లు ఎదురవుతున్నాయని తెలిపారు. వాటిని గుర్తించి అడ్డుకునే సాంకేతిక పరిజ్ఞానం, ప్రతిస్పందన సామర్థ్యాలను పెంచుకోవాలని సూచించారు. గూఢచార, నిఘా వ్యవస్థలను మరింత పటిష్టం చేసుకోవాల్సిన అవసరం ఉందని రక్షణ మంత్రి అన్నారు. శత్రువుల కదలికలు, వ్యూహాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించే వ్యవస్థలు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. ఎలాంటి పరిస్థితులు ఎదురైనా తక్షణమే స్పందించేలా సైనిక విభాగాల మధ్య సమన్వయం పెంచుకోవాలని సూచించారు. సైబర్ యుద్ధాలు, అంతరిక్ష రంగంలో ఆయుధాల మోహరింపు వంటి అత్యాధునిక యుద్ధ పద్ధతులపైనా వైమానిక దళం ప్రత్యేక దృష్టి పెట్టాలని రాజ్‌నాథ్ సింగ్ పిలుపునిచ్చారు.

జూన్ 2 నాటికి టిమ్స్‌లు కంప్లీట్

- ప్రజలకు పూర్తిస్థాయి సేవలందించాలి
- ఏడాదిలో ఉస్మానియా కొత్త భవనాలు ప్రజలకు అందాలి
- 3 టిమ్స్‌లకు ఏకీకృత నియామకాలు
- నిమ్స్... టిమ్స్‌ల మధ్య సమన్వయం ఉండాలి
- వైద్యులు, సిబ్బంది నియామక ప్రక్రియ వేగవంతం చేయండి
- వైద్య, ఆరోగ్య శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



హైదరాబాద్,
వచ్చే ఏడాది రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం నాటికి నిర్దేశిత పనులు పూర్తి చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. రానున్న జూన్ 2 నాటికి అల్వాల్, ఎల్బీ నగర్ టిమ్స్‌లు, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, నిమ్స్ విస్తరణ పనులు పూర్తి కావాలని సీఎం అధికారులను ఆదేశించారు. వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి ఉస్మానియా నూతన ఆసుపత్రి పనులు పూర్తి చేసి ప్రజలకు సేవలందించేలా చూడాలన్నారు. వైద్య, ఆరోగ్యశాఖపై ఎన్సీఆర్ హెచ్ఆర్టిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించి కీలక ఆదేశాలు జారీ చేశారు. టిమ్స్, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, నిమ్స్ విస్తరణ, ఉస్మానియా...నూతన ఆసుపత్రుల నిర్మాణ పనులు, ఆయా ఆసుపత్రులకు అవసరమైన పరికరాల కొనుగోలు, వైద్యులు, సిబ్బంది నియామకాలు ఏకకాలంలో పూర్తి కావాలని ఆకాంక్షించారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద ఒక్కో కుటుంబానికి అందించే వైద్య చికిత్స కవరేజీని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచిన విషయాన్ని ఈ సందర్భంగా సీఎం గుర్తు చేశారు. మూడేళ్లలోనే 9 మెడికల్ కాలేజీలు, 16 నర్సింగ్ కాలేజీలు, 28 పారామెడికల్ కాలేజీలు ఏర్పాటు చేశామన్నారు. సనత్ నగర్, అల్వాల్, ఎల్బీ నగర్ టిమ్స్‌లో వైద్యులు, ఇతర సిబ్బంది నియామకాలకు సంబంధించి ఏకీకృత విధానం పాటించాలని సీఎం రెడ్డి ఆదేశించారు. వైద్య సేవల అవసరాలకు అనుగుణంగా మూడు టిమ్స్‌ల మధ్య వైద్యులు, సిబ్బంది బదిలీలు జరిగేలా ఉండాలన్నారు. ఆసుపత్రుల నిర్వహణ, హౌస్ కీపింగ్ సిబ్బందిని ఔట్ సోర్సింగ్ విధానంలో చేపట్టాలని సీఎం సూచించారు. టిమ్స్ ల పర్యవేక్షణకు గ్రూప్-1 అధికారులను నియమిస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. హౌస్ కీపింగ్ సిబ్బందిపై పర్యవేక్షణకు విశ్రాంత సైనికాధికారులను నియమిస్తామన్నారు. నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యతలకు వేరే సిబ్బంది ఉంటే, వైద్యులు పూర్తిగా వైద్య సేవలపై దృష్టిసారించే అవకాశం ఉంటుందని సీఎం అన్నారు. నిమ్స్‌లో శస్త్రచికిత్సలకు సమయం ఎక్కువ తీసుకుంటున్నందున సనత్ నగర్ టిమ్స్‌ను పూర్తి స్థాయిలో వినియోగించాలని సీఎం రెడ్డి ఆదేశించారు. నిమ్స్‌లో బెడ్లు లేకపోయినా, శస్త్రచికిత్సలకు అలస్యమైనా సనత్ నగర్ టిమ్స్‌ను వినియోగోకోవాలన్నారు. ఈ విషయంలో వైద్యారోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, నిమ్స్, టిమ్స్ డైరెక్టర్లు నిత్యం సమన్వయం చేసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. టిమ్స్ లో వైద్యుల నియామకం ఫర్వాలేదు వరకు బయటి నుంచి వైద్యులను నియమించుకోవాలని, అందుకు అవసరమయ్యే మొత్తాన్ని వెంటనే విడుదల చేస్తామని సీఎం తెలిపారు. వైద్యులు, సిబ్బంది నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని సీఎం ఆదేశించారు. తాము అధికారంలోకి వచ్చాక కొత్తగా 16 డయాలసిస్ సెంటర్లను ఏర్పాటు చేశామని సీఎం తెలిపారు. నిర్మాణంలో ఉన్నవోర్ 79 డయాలసిస్ సెంటర్ల పనులు సత్వరమే త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సీఎం ఆదేశించారు.

పెద్ద సంఖ్య పెంచాం.. వసతులు కల్పించాం...

గడచిన మూడేళ్లలోనే ప్రభుత్వ ఆసుపత్రుల్లో బెడ్ల సంఖ్యను 30 వేల నుంచి 38 వేలకు పెంచిన విషయాన్ని అధికారులు సీఎం దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఔట్ పేషెంట్ల సంఖ్య 7కోట్లకు నుంచి 9 కోట్లకు పెరగడం, ఇన్ పేషెంట్ల సంఖ్య 23 లక్షల నుంచి 24.80 లక్షలకు పెరగడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్ర బడ్జెట్లో "ఆరోగ్య రంగానికి గతంలో గనుసన 3.9 శాతం కేటాయించగా, గత మూడేళ్లుగా గనుసన 4.8 శాతం నిధులు కేటాయిస్తున్న విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రస్తావించారు. మూడేళ్లలోనే వైద్యులు, నర్సులు, ఏఎన్ఎంలు, పారా మెడికల్ సిబ్బంది కలిసి 13,401 నియామకాలు పూర్తి చేశామని సీఎం తెలిపారు. మరో 5,640 నియామకాల ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ప్రజారోగ్యానికి పెద్ద పీట వేసే క్రమంలో వైద్యారోగ్య శాఖకు అవసరమైన నిధులను ఎంత మొత్తమైనా విడుదల చేస్తామని ముఖ్యమంత్రిరేవంత్ రెడ్డిస్పష్టం చేశారు. సమీక్షలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సీఎం కార్యదర్శి మాణిక్ రాజ్, వైద్య, ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జోంగ్లూ, టీజీఎంఎస్ఐడీసీ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్, వైద్య, ఆరోగ్య శాఖ కమిషనర్ ముషారఫ్ అలీ ఫారూఖీ, ఆర్ అండ్ బీ కార్యదర్శి ఇలంబర్తి, నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రా?ల్ దేవరాజ్, టిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నలతోలు తదితరులు పాల్గొన్నారు.

మరో తుపాన్ ముప్పు

(మొదటి తరువాయి)

వర్షాలు పడే సూచనలు ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు. మరోవైపు తెలంగాణలో ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయితో పోలిస్తే తగ్గుతున్నాయి. రాబోయే రెండు రోజుల్లో రాష్ట్రంలో సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీల వరకు తక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నదని వాతావరణ శాఖ తెలిపింది.

ప్రెస్ రిలీజ్‌ల కాలం పోయింది.. ఇప్పుడంతా ఇన్‌స్టా రీల్స్..!



న్యూఢిల్లీ:
మీడియాతో తనకు సుదీర్ఘకాలంగా అనుబంధం ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. జర్నలిజం రంగంలో కాలానుగుణంగా ఎన్నో మార్పులు చోటుచేసుకున్నాయని, సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో వార్తల ప్రసారం వేగం పెరిగిందని పేర్కొన్నారు. ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో జర్నలిస్టుల కోసం నిర్వహించిన దీపావళి మిలన్ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. బీజేపీలో చేరిన తొలినాళ్లలో మీడియా కార్యక్రమాల కోసం కుర్చీలు వేసే బాధ్యత తనదేనని మోదీ గుర్తుచేసుకున్నారు. అప్పట్లో విలేకరులతో అనేక విషయాలు మాట్లాడేవాడినని తెలిపారు. ఒకప్పుడు మీడియా సమావేశాల ప్రత్యక్ష ప్రసారం కోసం అవుట్‌సైడ్ బ్రాడ్‌కాస్ట్ (ఓబీ) వ్యాన్లను ఉపయోగించేవారని, ఇప్పుడు మొబైల్ ఫోనే బ్రాడ్‌కాస్ట్ వాహనంగా మారిపోయిందని వివరించారు. గతంలో ఏదైనా కార్యక్రమం నిర్వహిస్తే పత్రికా ప్రకటనలు విడుదల చేసేవారని, ప్రస్తుతం సామాజిక మాధ్యమాల విస్తృతితో ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ ద్వారా కూడా సమాచారం ప్రజలకు చేరుతోందని అన్నారు. విపత్తులు, సంక్షోభాల సమయంలో క్షేత్రస్థాయి జర్నలిస్టులు వార్తల సేకరణ కోసం ఎంతో శ్రమిస్తారని, ఎంతదూరమైనా వెళ్లి వాస్తవాలను ప్రజలకు చేరవేస్తారని ప్రశంసించారు. మీడియా ప్రపంచంలో సాధ్యం కానిదంటూ ఏదీ లేదని పేర్కొన్నారు. దేశాభివృద్ధి కోసం తమ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను వివరిస్తూ, పేదరిక నిర్మూలనకు ప్రత్యేకంగా కృషి చేసినట్లు చెప్పారు. గతంలో గరీబీ హఠావో వంటి నినాదాలకే పరిమితమైన పరిస్థితి ఉండేదని, తమ ప్రభుత్వం గత 12 ఏళ్లలో 50 కోట్ల మందిని దారిద్ర్యరేఖ నుంచి బయటపడేసిందని వెల్లడించారు. దేశంలో వివిధ రంగాల్లో అసాధారణ విజయాలు సాధిస్తున్న వ్యక్తులు ఎంతోమంది ఉన్నారని, వారి విజయగాథలను వెలుగులోకి తెచ్చి ప్రపంచానికి పరిచయం చేయాలని జర్నలిస్టులకు ప్రధాని పిలుపునిచ్చారు.

బీజేపీ, ఆరెస్సెస్ విదేశీ అంటూ నా తల్లిని విమర్శించాయి :



న్యూఢిల్లీ
వాయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ ఇటీవల తన తల్లి సోనియా గాంధీ విడుదల చేసిన ఆత్మకథ 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' ను గట్టిగా సమర్థించారు. తన గురించి తాను చెప్పుకొనే హక్కు ఆమెకు ఉందని అన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు గత కొన్నేళ్లుగా సోనియాగాంధీపై అబద్ధాలు ప్రచారం చేస్తూ కల్పిత కథలు అల్లాయని మండిపడ్డారు.ఇప్పుడు వారంతా ఆ పుస్తకాన్ని చదువుతున్నందుకు సంతోషంగా ఉందన్నారు. వయనాడ్ పర్యటనకు వెళ్లిన ప్రియాంక గాంధీ.. అక్కడ మీడియాతో మాట్లాడారు. విదేశీ మహిళ అంటూ బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు నిరంతరం విమర్శిస్తున్నా సోనియా మాత్రం ఇప్పటివరకు నోరెత్తలేదన్న అంశాన్ని గుర్తుచేశారు. భారత్‌లో తన తల్లి జీవితం గురించి బీజేపీ, ఆర్ఎస్ఎస్ నోటికొచ్చినట్లు మాట్లాడాయని విమర్శించారు. తన తల్లిపై అబద్ధాలు ప్రచారం చేస్తూ కల్పిత కథనాలు రాశారని మండిపడ్డారు. అయినా అమ్మ ఇన్నాళ్లూ మౌనంగా ఉండిపోయారని, ఇప్పుడు వాస్తవాలను పుస్తకం రూపంలో ఆమే స్వయంగా వెల్లడించారని ప్రియాంకాగాంధీ చెప్పారు. అందులో తప్పేముందని, అది ఆమె హక్కు అని సమర్థించారు. ఇన్నాళ్లు బీజేపీ అబద్ధాలు చెబితే.. ఇప్పుడు నిజమేంటో ప్రజల ముందుకు నా తల్లి తీసుకొచ్చారని ప్రియాంకాగాంధీ అన్నారు.


నేటి నుంచి భారత్ సమ్మిట్

(మొదటి తరువాయి)

జరిగే ఈ సదస్సులో పలు అంతర్జాతీయ అంశాలపై చర్చించనున్నారు. ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, వాతావరణ మార్పులు, కృత్రిమ మేధస్సు, అంతర్జాతీయ సంబంధాలు తదితర అంశాలు చర్చకు రానున్నాయి. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఈ నెల 14న జరిగే ముగింపు సమావేశంలో ప్రసంగించనున్నారు. భారత్ విదేశాంగ విధానం, అంతర్జాతీయ సహకారం, వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిపై ఆయన తన అభిప్రాయాలను వెల్లడించనున్నారు. కాంగ్రెస్ నేతలు శశిథరూర్, గౌరవ్ గొగొయ్, సచిన్ పైలట్ తదితరులు వివిధ అంతర్జాతీయ చర్చలకు సమన్వయం వహించనున్నారు. రాష్ట్ర అభివృద్ధిపై ప్రత్యేకంగా తొమ్మిది సమావేశాలు నిర్వహించనున్నారు. ఫ్యూచర్ సిటీ, పట్టణీకరణ, ఆర్థిక, సామాజిక న్యాయం, సంక్షేమ పథకాలు, యువత, క్రీడలు, ఎన్నికల సమగ్రత వంటి అంశాలపై చర్చించనున్నారు. ఈ సమావేశాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబుతో పాటు పలువురు మంత్రులు పాల్గొననున్నారు.



మంత్రుల పిల్లల విదేశీ విద్య



ఇటీవల కేంద్ర మంత్రుల పిల్లల విద్యా నేపథ్యంపై వెలుగులోకి వచ్చిన వివరాలు ఈ చర్చకు మరింత ప్రాధాన్యతను తీసుకొచ్చాయి. కేంద్ర మంత్రుల పిల్లల్లో 15 మంది ప్రస్తుతం విదేశాల్లో చదువుతున్నట్టు ప్రచారం జరిగింది. వీరిలో కొందరు ప్రపంచ ప్రఖ్యాత విశ్వవిద్యాలయాల్లో ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. అయితే దేశాన్ని విశ్వగురువుగా తీర్చిదిద్దుతామని చెప్తున్న పాలకవర్గానికి చెందిన కుటుంబాలే తమ పిల్లల ఉన్నత విద్య కోసం విదేశీ విశ్వవిద్యాలయాలకు ప్రాధాన్యత ఇస్తున్నాయి. అంటే.. దేశంలోని విద్యావ్యవస్థపై వారికి ఎంత విశ్వాసం ఉన్నదనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఒక రైతు బిడ్డకు, కార్మికుడి బిడ్డకు, దళిత, గిరిజన, బలహీనవర్గాల విద్యార్థికి విదేశీ విద్య ఎందుకు అందడం లేదు? విదేశీ విద్య కోసం రూ.కోట్లు ఖర్చు చేయగలిగే కుటుంబాలు ఒకవైపు ఉంటే, ప్రభుత్వ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ఆఫీసుల చుట్టూ తిరిగే పేద విద్యార్థులు మరోవైపు ఉన్నారు. ఇది కేవలం ఆర్థిక అసమానత కాదు. విద్యావకాశాల్లో ఉన్న సామాజిక అసమానతకు అద్దం పడుతున్న పరిస్థితి. దేశంలో బీజేపీ పాలనలో సామాజిక అసమానతలు తీవ్రస్థాయిలో పెరుగడానికి ఈ విధానాలు కూడా కారణం కాదా? నీతి ఆయోగ్ 2025 డిసెంబర్‌లో ప్రచురించిన Internationalisation of Higher Education in India నివేదికలోని గణాంకాలు విద్యార్థులను, యువతను ఆలోచింపజేస్తున్నాయి. 2016లో విదేశాల్లో చదివిన భారతీయ విద్యార్థుల సంఖ్య 6.84 లక్షలు ఉండగా, 2024 నాటికి అది 13.35 లక్షలకు చేరింది. అంటే విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న భారతీయ విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. నివేదిక ప్రకారం, 202122లో మన దేశానికి వచ్చిన విదేశీ విద్యార్థుల సంఖ్య 46,878 మాత్రమే. మరోవైపు, అదే సమయంలో 11.59 లక్షల మంది భారతీయ విద్యార్థులు విదేశాల్లో చదువుతున్నారు. ఈ వ్యత్యాసం దేశ ఉన్నత విద్యావ్యవస్థకు, అంతర్జాతీయ విద్యాప్రమాణాలకు మధ్య ఉన్న అంతరాన్ని స్పష్టంగా తెలియజేస్తున్నది. విదేశీ విద్య కోసం భారతీయులు చేసే వార్షిక చెల్లింపులు 201314లో 0.16 బిలియన్ డాలర్ల నుంచి 202324లో దాదాపు 3.4 బిలియన్ డాలర్లకు పెరిగాయి. అంటే భారతీయ కుటుంబాలు విదేశీ విద్య కోసం భారీగా ఆర్థిక వనరులను వెచ్చిస్తున్నారు. దేశంలోని ఉన్నత విద్యావ్యవస్థను ప్రపంచస్థాయి విద్యకు గమ్యస్థానంగా తీర్చిదిద్దాల్సిన కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారులకు ఎర్రతివాచీలు పరచి స్వాగతం పలికింది తప్ప, ఈ దేశ మట్టి బిడ్డలకు నాణ్యమైన ఉన్నత విద్యను అందించడంలో ఆశించిన స్థాయిలో విజయవంతం కాలేదు. ప్రపంచానికి జ్ఞానాన్ని అందించిన నలంద, తక్షశిల వంటి ప్రాచీన విద్యా కేంద్రాల వారసత్వాన్ని మనం గర్వంగా చెప్పుకొంటాం. కానీ ఆ వారసత్వాన్ని నిలబెట్టాలంటే ఆధునిక పరిశోధన, సాంకేతిక పరిజ్ఞానం, నిపుణులైన అధ్యాపకులు, అంతర్జాతీయ విద్యా భాగస్వామ్యాలు అవసరం. ప్రభుత్వం దేశంలో విదేశీ విశ్వవిద్యాలయాల క్యాంపస్‌ల ఏర్పాటును ప్రోత్సహించడం ఒక విధానం కావచ్చు. కానీ అదే సమయంలో మన ప్రభుత్వ వర్సిటీలను కూడా ప్రపంచస్థాయికి తీసుకెళ్లాలి. విదేశీ సంస్థలను ఆహ్వానించడం మాత్రమే అంతర్జాతీయ విద్యా కేంద్రంగా ఎదగడానికి సరిపోదు. మన విద్యార్థులు విదేశాలకు వెళ్లే పరిస్థితిని తగ్గించడానికి దేశంలోనే అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందించాలి. పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, పరిశోధన ఫెలోషిప్‌లు, ప్రభుత్వ విశ్వవిద్యాలయాలకు తగిన నిధు లు, అధ్యాపక నియామకాలు, పరిశ్రమలతో అనుసంధానం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రభుత్వ వర్సిటీల్లో అధ్యాపకుల ఖాళీలు, పరిశోధనలకు పరిమిత నిధులు, పాతబడిన పాఠ్యప్రణాళికలు, ఆధునిక ప్రయోగశాలల కొరత, పరిశ్రమలకు అనుగుణంగా నైపుణ్యాలను అందించలేకపోవడం వంటి సమస్యలు వెంటాడుతున్నాయి. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యావ్యవస్థను ఆధునికీకరించడంలో కేంద్రం విఫలమవుతున్నది. PRS Legislative Research విశ్లేషణ ప్రకారం, 2025 జనవరి నాటికి కేంద్ర విశ్వవిద్యాలయాల్లో మంజూరైన బోధనా పోస్టుల్లో 29 శాతం ఖాళీగా ఉన్నాయి. ప్రొఫెసర్ పోస్టుల్లో 56 శాతం, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టుల్లో 38 శాతం ఖాళీలు ఉన్నాయి. ఒకవైపు ప్రపంచస్థాయి విశ్వవిద్యాలయాల గురించి మాట్లాడుతూనే, మరోవైపు మన వర్సిటీల్లో అధ్యాపకుల పోస్టులు ఖాళీగా ఉండటం చూస్తే ఉన్నత విద్య పట్ల కేంద్ర ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏమిటో అర్థమవుతున్నది. విద్యకు, ఉపాధికి విడదీయలేని సంబంధం ఉన్నది. దేశంలో చదువుకున్న యువతకు తగిన ఉద్యోగాలు లభించకపోతే వారు విదేశాల వైపు చూస్తారు. అక్కడ చదువుతోపాటు ఉద్యోగావకాశాలు, మెరుగైన జీవన ప్రమాణాలు, వృత్తిపరమైన ఎదుగుదలకు అవకాశాలు కనిపిస్తాయి. ఇది భారత్‌కు మానవ వనరుల నష్టం కలిగించే ప్రమాదం అవుతుంది. విద్యావంతులైన యువత దేశంలోనే పరిశోధనలు, ఆవిష్కరణలు, పరిశ్రమలు, ఉపాధి రంగాల్లో పనిచేస్తే దేశ ఆర్థిక వ్యవస్థకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది. ఈ పుష్కర కాలంలో ఈ పరిస్థితి మరింత తీవ్రంగా మారింది. దేశాన్ని విశ్వగురువుగా తీర్చిదిద్దుతామని ప్రకటిస్తున్న పాలకులు తమ దేశంలోని విద్యాసంస్థలపై ప్రజలకు ఎందుకు నమ్మకం కల్పించలేకపోతున్నారు. విశ్వగురు బిరుదు ప్రచారంతో కాదు.. విశ్వవిద్యాలయాల ప్రమాణాలతో వస్తుంది. దేశ ప్రజలకు నాణ్యమైన విద్యను అందించి, విద్యార్థులకు భవిష్యత్తుపై భరోసా కల్పించినప్పుడే ఆ గౌరవం దక్కుతుంది. ముందుగా దేశంలోని విశ్వవిద్యాలయాలను విశ్వస్థాయికి తీసుకెళ్లండి. స్వదేశంలోనే ప్రపంచస్థాయి విద్యను అందించండి. అదే నిజమైన ఆత్మనిర్భర్ భారత్.. అదే నిజమైన విశ్వగురు భారత్.

చడ్మల్ తండాలో భారీ అగ్నిప్రమాదం

-ఇల్లు పూర్తిగా అగ్నికి ఆహుతి, రూ.10 లక్షల ఆస్తి నష్టం



గాంధారి: నవంబర్ 12(మహాప్రభ)
గాంధారి మండలం చడ్మల్ తండాలో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. స్థానికులు, అగ్నిమాపక సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం రాయిదాస్ మంగులు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ప్రమాదవశాత్తు అగ్నిమంటలు చెలరేగాయి.దీంతో చుట్టుపక్కల వారు నీటితో మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నించారు. అనంతరం స్థానిక అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా వెంటనే అక్కడికి చేరుకున్న సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఆస్తి నష్టం ఈ ప్రమాదంలో దాదాపు ఇల్లు పూర్తిగా అగ్నికి ఆహుతైంది. కొత్త ఇంటి నిర్మాణం కోసం దాచుకున్న టేకు దుంగలు, పండించిన పంట ధాన్యం, బంగారం, వెండి వస్తువులు, నగదు బీరువాతో సహా పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. అగ్ని ప్రమాదం సంభ వించిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం సంభవించలేదు. దాదాపు రూ.10 లక్షల వరకు ఆస్తి నష్టం సంభవించిందని స్థానికులు పేర్కొన్నారు.

ఆంగ్ల సాహిత్యంలో పసుపుల రాజశేఖర్‌కు డాక్టరేట్



చిట్వేలు, -12నవంబర్ (మహాప్రభ
తిరుపతి జిల్లా చిట్వేలు మండల కేంద్రంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న పసుపుల రాజశేఖర్‌కు ఆంగ్ల సాహిత్యంలో డాక్టరేట్ లభించింది. కడప యోగి వేమన విశ్వవిద్యాలయంలో ఆంగ్ల విభాగం ఆచార్యులు పుత్తా పద్మ పర్యవేక్షణలో భారతీయ మహిళా ఉద్యమకారిణుల ఆత్మకథలపై ఆయన పరిశోధన చేశారు. ఈ నెల 9న జరిగిన మౌఖిక పరీక్షలో పరిశోధనను సమర్థించుకోవడంతో డాక్టరేట్ పట్టా పొందారు. మహిళా ఉద్యమకారిణులు రమాదేవి చౌధురి, కె. లక్ష్మీ రఘురామయ్య, బామ, ఫ్లావియా ఆగ్నెస్‌ల ఆత్మకథలను పరిశీలించి మహిళలపై వివక్ష, కుల అసమానతలు, పితృస్వామ్య వ్యవస్థ, మహిళా సాధికారత, సామాజిక న్యాయం, మహిళల హక్కుల కోసం వారు చేసిన పోరాటాలను పరిశోధనలో పొందుపరిచారు. రాజశేఖర్ గత పదేళ్లుగా చిట్వేలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు ఎన్‌సీసీ అధికారిగా విద్యార్థులకు శిక్షణ అందిస్తున్నారు. విద్యారంగంలో చేసిన సేవలకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారంతో పాటు పలు పురస్కారాలు అందుకున్నారు. డాక్టరేట్ సాధించిన రాజశేఖర్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలరాజు దుర్గరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఎన్‌సీసీ అధికారులు అభినందించారు.

అన్నప్రసాద వితరణ పథకానికి రూ.1,00,116 విరాళం



శ్రీశైలం, -12నవంబర్ (మహాప్రభ).
శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణ పథకానికి ఒంగోలుకు చెందిన శ్రీ డి. అంజిరెడ్డి గురువారం రూ.1,00,116 విరాళంగా అందజేశారు. ఈ విరాళం మొత్తాన్ని దేవస్థానం పర్యవేక్షకులు కె. శివప్రసాదు స్వీకరించారు. ఈ సందర్భంగా దాతకు దేవస్థానం తరఫున తగిన రశీదుతో పాటు స్వామివార్ల ప్రసాదాలు, శేషవస్త్రం అందజేసి సత్కరించారు. అన్నప్రసాద వితరణ పథకానికి విరాళం అందించిన దాతను దేవస్థానం అధికారులు అభినందించారు.

డిగ్రీ కళాశాల, క్రీడా మైదాన నిర్మాణానికి భూమి కేటాయించాలి

-కలెక్టర్ ఖుష్బూ గుప్తాతో ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి సమావేశం
-మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం నవంబర్ 12 మహాప్రభ



మహబూబ్‌నగర్: -12నవంబర్ (మహాప్రభ).
దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జీఎంఆర్) గురువారం మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాను కలిసి నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులపై చర్చించారు. ఈ సందర్భంగా దేవరకద్ర మండల కేంద్రానికి మంజూరైన డిగ్రీ కళాశాల నిర్మాణానికి అవసరమైన భూమిని కేటాయించాలని ఎమ్మెల్యే కలెక్టర్‌ను కోరారు. అదేవిధంగా దేవరకద్ర పట్టణంలో డిగ్రీ కళాశాల ఏర్పాటుతో పాటు క్రీడా మైదానం నిర్మాణానికి అదనంగా 3 ఎకరాల 30 గుంటల భూమిని కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. చిన్నచింతకుంట మండల కేంద్రంలో జూనియర్ కళాశాలకు నూతన భవన నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యే కోరారు. అలాగే భూత్పూర్ మండలాన్ని కరువు ప్రభావిత మండలంగా ప్రకటించాలని జిల్లా యంత్రాంగాన్ని విజ్ఞప్తి చేశారు.రానున్న రోజుల్లో ఎల్‌నినో ప్రభావం వల్ల తాగునీటి సమస్యలు తలెత్తే అవకాశం ఉన్న నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్‌ను కోరారు. అవసరమైన ప్రాంతాల్లో తాగునీటి సౌకర్యాల కల్పనకు ప్రత్యేక నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే ప్రస్తావించిన సమస్యలు, అభివృద్ధి పనులపై జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా సానుకూలంగా స్పందించారు.

మహనీయుల విగ్రహాల ప్రతిష్టాపనకు ముహూర్తం సురువు

-చిన్న కొత్తపల్లి గ్రామ సర్పంచ్ తోకల రాజేశ్వరి విష్ణువర్ధన్ యాదవ్ ముఖ్య అతిథులుగా పాల్గొని భూమి పూజ కార్యక్రమం ప్రారంభించారు



మహాప్రభ వనపర్తి
నవంబర్ 12 మహాప్రభ
భారత స్వాతంత్రోద్యమ రథసారథి మహాత్మా గాంధీ మరియు సామాజిక ఉద్యమాల పితామహుడు జ్యోతిరావు పూలే భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ లా విగ్రహాల ప్రతిష్టాపనకు కలిసి వచ్చిన కాలం అన్ని కులాల మేధావులను ఏకం చేసి విగ్రహా ల ప్రతిష్టాపనకు ముహూర్తాన్ని సులువు చేయడం జరిగింది . ఇందులో అన్ని కులాల కు సంబంధించినటువంటి వాళ్ళు ఉండడం ఇది చాలా చారిత్రాత్మకమైన ఘట్టంగా భావించడం జరుగుతుంది ఎందుకంటే ఇందులో నిస్వార్థంగా అందరూ కలిసి ఒక్కటై మేమందరం మీతో కలిసి వస్తాము మనమందరం కలిసి విగ్రహాలను ప్రతిష్టించుకుందాం అని చెప్పి కులాలకు అతీతంగా చిన్న పెద్ద అనే తేడాలు లేకుండా చదువుకున్న యువకులు అదేవిధంగా రాజకీయ లకు అతీతంగా రాజకీయ నాయకులు కలిసి రావడం అనేది ఇది ఒక చారిత్రాత్మకమైన విషయం గా భావించవచ్చు ఈ కార్యక్రమంలో మేమున్నామంటూ ముందుకు వచ్చినటువంటి గ్రామ సర్పంచి తోకలి రాజేశ్వరి విష్ణువర్ధన్ యాదవ్ ఉపసర్పంచి కటిక భారతమ్మ సత్యం మాజీ ఎంపిటిసి తల్లారి కొండలయ్య గౌడ్ వార్డు మెంబర్స్ రిటైర్డ్ ఉద్యోగస్తులు విలేకరులు న్యాయవాదులు వ్యాపారస్తులు మేధావులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని హర్షం వ్యక్తపరిచారు

నేడే దేవరకొండలో చేయూత పెన్షన్ పత్రాల పంపిణీ

దేవరకొండ నవంబర్ 12 (మహాప్రభ)
దేవరకొండ మున్సిపాలిటీ పరిధిలో నూతన చేయూత పెన్షన్ లబ్ధిదారులకు మంజూరి పత్రాల ను అందజేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రామ దుర్గారెడ్డి తెలిపారు. డిండి రోడ్డులో గల సాయి శివ గార్డెన్లో శుక్రవారం ఉదయం 10 గంటలకు లబ్ధిదారులకు దేవరకొండ శాసనసభ్యులు ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ మంజూరి పెన్షన్ పత్రాలను అందజేస్తారని కమిషనర్ తెలిపారు

జిల్లాలో ఎల్ నినో గ్రామసభలు సమర్థవంతంగా నిర్వహించాలి.

-కరువు అవగాహనతో పాటు ఇందిరమ్మ ఇండ్లు,జలసిరి కార్యక్రమాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి.
-ఉపాధి హామీ పనుల ద్వారా కూలీలకు విస్తృతంగా పని కల్పించాలి.
-గ్రామ సభలు నిర్వహణలో సంబంధిత అధికారుల సమన్వయం అవసరం
-అదనపు కలెక్టర్ నగేష్.



మెదక్ జిల్లా -12నవంబర్ (మహాప్రభ).
జిల్లాలో ఎల్ నినో గ్రామసభలు సమర్థవంతంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ నగేష్ అధికారులను, ఎంపీడీవోలను ఆదేశించారు. గురువారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయం నుండి జిల్లా గ్రామీణ అభివృద్ధి, పంచాయితీ, మిషన్ భగీరథ, ఆర్డబ్ల్యూఎస్ , పంచాయతీరాజ్ జిల్లా సంక్షేమ శాఖ అధికారులతో కలిసి ఎంపీడీవోలతో ఎల్ నినో గ్రామసభలు, ఇందిరమ్మ ఇండ్ల పురోగతి, జలసిరి పనులు, అంగన్వాడి బిల్డింగ్స్ నిర్మాణం, తదితర అంశాలపై గూగుల్ మీట్ నిర్వహించారు. ముందుగా ఎల్ నినో గ్రామసభల నిర్వహణ తీరుపై వివిధ మండలాల ఎంపీడీవోల వారిగా రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ జిల్లాలో ఎల్ నినో గ్రామసభలు క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారులతో కలిసి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.జలసిరి పనులకు సంబంధించి కొన్ని మండలాల్లో కొత్త పనుల ప్రారంభం, గ్రౌండింగ్, పూర్తిలో ఆశించిన పురోగతి కనిపించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. మంజూరైన పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. కమ్యూనిటీ సోక్‌పిట్స్ నిర్మాణంలో కూడా పురోగతి పెంచాలన్నారు. . వచ్చే వారం నాటికి నిర్దేశించిన లక్ష్యాలకు , మంజూరైన పనులన్నీ ప్రారంభించి పురోగతి సాధించాలని ఆదేశించారు. గ్రామసభలు నిర్వహించేటప్పుడు ప్రతి శాఖ యాక్టివిటీ గురించి తప్పనిసరిగా చర్చించాలన్నారు. జిల్లా విద్యాశాఖ తరఫున పాఠశాలల్లో ఎల్ నినో అంశంపై విద్యార్థులతో మాట్లాడించాలన్నారు. ప్రతి మండలం వ్యక్తిగత ఇంకుడు గుంతల నిర్మాణంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. వర్షాభావ పరిస్థితుల వల్ల రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, డిపిఓ యాదయ్య, మిషన్ భగీరథ సంపత్ కుమార్, డి ఎల్ పి ఓ లు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వనపర్తి పట్టణ అభివృద్ధిలో రోడ్ల విస్తరణ కీలకం..

- పనుల్లో వేగం పెంచాలి

-అధికారులకు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆదేశం..



వనపర్తి నవంబర్ 12 మహాప్రభ

రోడ్డు విస్తరణకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి వనపర్తి పట్టణంలో చేపడుతున్న రోడ్డు వెడల్పు పనులను గురువారం వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు పట్టణంలోని పొట్టి శ్రీరాములు చౌరస్తా వద్ద జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే, పనులను మరింత వేగవంతం చేసి నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వనపర్తి పట్టణాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలంటే రోడ్ల విస్తరణ ఎంతో కీలకమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. భవిష్యత్తులో పెరుగుతున్న వాహనాల రద్దీకి అనుగుణంగా పట్టణంలో మెరుగైన రహదారి సదుపాయాలు కల్పించడమే లక్ష్యమని తెలిపారు. పట్టణ అభివృద్ధి అనేది ఒక్కరి బాధ్యత కాదని, ప్రతి ఒక్కరి భాగస్వామ్యంతోనే సాధ్యమవుతుందని పేర్కొంటూ, రోడ్డు విస్తరణ పనులకు పట్టణ ప్రజలు, వ్యాపారులు మనస్ఫూర్తిగా సహకరించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. వనపర్తి అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వనపర్తి మున్సిపల్ చైర్మన్ మాధవి ఎస్ఎల్ఎన్ రమేష్, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కదిరె రాములు, స్థానిక కౌన్సిలర్ రవి యాదవ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ బ్రహ్మచారి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వాకిటి ఆదిత్య, మున్సిపల్ మాజీ చైర్మన్ పుట్టపాకుల మహేష్, మాజీ వైస్ చైర్మన్ బి. కృష్ణ, పాకనాటి కృష్ణ, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రు తండ కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీ ఎన్నిక

పార్టీ బలోపేతమే లక్ష్యంగా నూతన కమిటీ ఏర్పాటు





పెద్దవంగర నవంబర్ 12 (మహాప్రభ)

రామచంద్రు తండలో కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీని ఎన్నుకున్నారు. గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు, ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేసే లక్ష్యంతో నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ అధ్యక్షుడిగా జాటోత్ సక్రు, ఉపాధ్యక్షుడిగా జాటోత్ రాజ, కిసాన్ సెల్ అధ్యక్షుడిగా జాటోత్ జితేందర్, ప్రధాన కార్యదర్శిగా జాటోత్ సుధాకర్, ప్రచార కమిటీ అధ్యక్షుడిగా జాటోత్ మాంజిలాల్, యాక్టివ్ అధ్యక్షుడిగా జాటోత్ రమేష్ ఎన్నికయ్యారు. కోశాధికారులుగా జాటోత్ దేవా, జాటోత్ చందర్, గౌరవ సలహాదారులుగా జాటోత్ భోజ్య, జాటోత్ రాజేశ్వర్, జాటోత్ రాములు నియమితులయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రంగు మురళి మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేస్తూ, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు గ్రామ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి సమష్టిగా కృషి చేయాలని పార్టీ శ్రేణులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్ తో పాటు కాంగ్రెస్ నాయకులు యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చిలక బిచ్చమ్మ దశదిన కర్మకు హాజరై కుటుంబ సభ్యులకు పరామర్శ

-మృతురాలి కుటుంబానికి నాయకుల పరామర్శ.. మనోధైర్యం



పెద్దవంగర నవంబర్ 12 (మహాప్రభ)

మండల కేంద్రంలోని పాత ఎస్సీ కాలనీకి చెందిన చిలక బిచ్చమ్మ దశదిన కర్మ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు కార్యక్రమానికి హాజరై, బిచ్చమ్మ కుమారుడు, మండల నాయకులు చిలుక ఐలయ్యతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ మనోధైర్యం కల్పించారు. ఈ సందర్భంగా గ్రామ కుల పెద్దలు, నాయకులు కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్దవంగర మండల బీఆర్ఎస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు చిలుక బిక్షపతి, గ్రామ నాయకులు చిలక సోమయ్య, చిలుక ఉప్పలయ్య, చిలక యాదగిరి, చిలుక మల్లేష్, చిలుక గణేష్, చిలక ఎల్లేష్, చిలక జంపయ్య, చిలుక శ్రీను, బంధుమిత్రులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా, విద్యారంగాలకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట..

-యువత భవిష్యత్తుకు సీఎం రేవంత్ రెడ్డి బాటలు

-క్రీడాభివృద్ధికి రూ.760 కోట్ల బడ్జెట్ కేటాయింపు..

-ప్రతిభ ఉన్న క్రీడాకారులకు వ్యక్తిగతంగా అండగా ఉంటా: ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



వనపర్తి నవంబర్ 12 మహా ప్రభ

పెద్దమందడి మండల కేంద్రంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే క్రీడలు కేవలం శారీరక దృఢత్వానికే కాకుండా వ్యక్తిత్వ వికాసానికి, క్రమశిక్షణకు, ఉన్నత స్థాయి గుర్తింపునకు మార్గమని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి అన్నారు. విద్యా, క్రీడా రంగాల అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం విశేష ప్రాధాన్యతనిస్తూ అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. గురువారం పెద్దమందడి మండల కేంద్రంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని అన్ని నియోజకవర్గాల క్రీడాకారులు పాల్గొనేలా నిర్వహించిన వాలీబాల్ పోటీలను ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో క్రీడారంగ అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని, క్రీడల అభివృద్ధి కోసం రూ.760 కోట్ల బడ్జెట్ కేటాయించడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, వారికి తగిన అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. క్రీడాకారులకు మెరుగైన ప్రోత్సాహం, క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధి, యువతకు క్రీడల్లో అవకాశాల కల్పన వంటి అంశాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని వివరించారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రానికి, దేశానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని యువతకు పిలుపునిచ్చారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచే క్రీడాకారులకు తన వంతుగా వ్యక్తిగత సహాయ సహకారాలు అందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం

విద్యాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన, మెరుగైన వసతులు కల్పించడంతో పాటు విద్యార్థులను ప్రోత్సహించేలా ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రత్యేక కిట్లు అందించడం ద్వారా వారి చదువుకు అవసరమైన ప్రోత్సాహాన్ని అందిస్తోందని తెలిపారు

ప్రభుత్వ విద్యా వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం పెరుగుతోందని, లక్షలాది మంది విద్యార్థులు ప్రభుత్వ విద్యాబోధన వైపు మళ్లడం ప్రభుత్వ విద్యారంగ సంస్కరణలకు నిదర్శనమని అన్నారు పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని వివరించారు.

ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటో తేదీనే జీతాలు..

ప్రజా పాలనలో మారిన పరిస్థితులు ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమానికి కూడా కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు

గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగులకు ఎప్పుడు జీతాలు వస్తాయో తెలియని పరిస్థితులు ఉండేవని, ప్రస్తుతం ప్రతి నెలా ఒకటో తేదీనే ఉద్యోగులకు జీతాలు అందించే విధంగా ప్రజా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. ఉద్యోగుల ఆర్థిక భద్రత, సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. విద్య, క్రీడలు, ఉద్యోగుల ల సంక్షేమం.. ఇలా అన్ని రంగాల్లో ప్రజలకు మేలు చేసే విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో పెద్దమందడి, ఖిల్ల ఘణపురం మార్కెట్ యార్డుల అధ్యక్షురాలు నవనీత క్యామ రాజు, ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్ రెడ్డి, ఎంఈఓ శాంతయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొమ్ము వెంకటస్వామి, మాజీ ఎంపీపీ రఘు ప్రసాద్, మార్కెట్ యార్డ్ మాజీ ఉపాధ్యక్షులు రామకృష్ణారెడ్డి, సర్పంచులు గంగా టైలర్ రవి, స్వరూప వెంకటస్వామి, మంగంపల్లి సర్పంచ్ రమేష్, స్కూల్ తండా సర్పంచ్ మన్నెం, వీరాయిపల్లి సర్పంచ్ వెంకటయ్య, దొడగుంటపల్లి సర్పంచ్ పెంటయ్య, పెద్దమందడి ఉపసర్పంచ్ ఉషన్న, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

బాలల దినోత్సవం అంటే కేవలం చాక్లెట్లు పంచడం కాదు... పిల్లల ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు బాధ్యత తీసుకోవడం!

వనపర్తి నవంబర్ 12 మహాప్రభ

నేటి బాలలే రేపటి భారతదేశ భవిష్యత్తు. అలాంటి చిన్నారుల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. కానీ పాఠశాలల పరిసరాల్లోని దుకాణాల్లో విచ్చలవిడిగా విక్రయిస్తున్న జంక్ ఫుడ్, చాక్లెట్లు, బిస్కెట్లు, కూల్ డ్రింక్స్, అధిక చక్కెర కలిగిన ఆహార పదార్థాలు చిన్నారుల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. రుచికి అలవాటుపడుతున్న పిల్లలు తెలియకుండానే అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లకు బానిసలవుతున్నారు. చిన్న వయసులోనే ఊబకాయం, దంత సమస్యలు, ఇతర ఆరోగ్య సమస్యలకు ఇవి కారణమయ్యే ప్రమాదం ఉంది.

నవంబర్ 14 బాలల దినోత్సవం సందర్భంగా... పిల్లలకు చాక్లెట్లు పంచి శుభాకాంక్షలు చెప్పడమే కాదు, వారి ఆరోగ్యాన్ని కాపాడేందుకు కూడా మనం



బాధ్యత తీసుకోవాలి. పాఠశాల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, జిల్లా అధికారులు **ఈ విషయంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి.**

ఈ నేపథ్యంలో పాఠశాలల ముందు, పరిసర ప్రాంతాల్లో జంక్ ఫుడ్, అధిక చక్కెర కలిగిన పానీయాలు మరియు అనారోగ్యకరమైన ఆహార పదార్థాల విక్రయాలను నియంత్రించేందుకు కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా అదనపు కలెక్టర్ కి వినతిపత్రం అందించి ఫిర్యాదు చేయడం జరిగింది.

పాఠశాలల పరిసరాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, పిల్లల ఆరోగ్యానికి హాని కలిగించే ఆహార పదార్థాల విక్రయాలపై తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేయడం జరిగింది బాలల దినోత్సవం నాడు ఒక్కరోజు ఆనందం కాదు... పిల్లలకు జీవితాంతం ఆరోగ్యం

జంక్ ఫుడ్‌కు దూరంగా... ఆరోగ్యకరమైన బాల్యానికి దగ్గరగా!

ఈ కార్యక్రమం లో ఎన్ ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్, అనిల్ , శరత్ , శివాజీ తదితరులు పాల్గొన్నారు.

రూ.200 కోట్లతో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను త్వరితగతిన పూర్తి చేయాలి

-ఎమ్మెల్యే బాలు నాయక్.

దేవరకొండ డివిజన్. నవంబర్ 12 (మహాప్రభ)

కొండమల్లేపల్లి:మండలంలో కోలుముంతల్ పహాడ్ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూ.200 కోట్ల వ్యయంతోనూతనంగా నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణపనులనుదేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతిని సంబంధిత కాంట్రాక్టర్,నిర్మాణసిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, నిర్ణీత ప్రమాణాలకు అనుగుణంగా పనులుచేపట్టాలనిఎమ్మెల్యే సూచించారు. పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా వేగవంతం చేసి, వీలైనంత త్వరగాపూర్తిచేసిదేవరకొండ నియోజకవర్గ విద్యార్థులకు అందుబాటులోకితీసుకురావాలనిసంబంధితకాంట్రాక్టర్ అధికారులకు స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే



మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజాప్రభుత్వంవిద్యారంగ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందని తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు కూడా నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన విద్యా వసతులు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం విద్యారంగంలో మౌలిక సదుపాయాల కల్పనకుపెద్దపీటవేస్తోందన్నారు.రూ.200 కోట్లతో నిర్మిస్తున్న ఈ ఇంటిగ్రేటెడ్ స్కూల్ అందుబాటులోకి వస్తేదేవరకొండనియోజకవర్గ విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు సైతం ఉన్నత విద్యావకాశాలను అందిపుచ్చుకొని భవిష్యత్తులోఉన్నత స్థాయికి ఎదగాలన్నదే ప్రజాప్రభుత్వ సంకల్పమని అన్నారు.

విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని నిర్మాణ పనులను నాణ్యతతో, వేగంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే సంబంధిత సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, దూదిపాల రేఖ శ్రీధర్ రెడ్డి, మండల అధ్యక్షుడు కాసర్ల వెంకటేశ్వర్లు, ఊట్కూరి వేమన్ రెడ్డి, రవి నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమం

-వ్యవసాయంపై ఎల్ నినో ప్రభావంపై రైతులకు అవగాహన

గాంధారి: నవంబర్ 12 (మహాప్రభ)

గాంధారి మండలం గుర్జాల్ గ్రామంలో ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమం మరియు వ్యవసాయంపై ఎల్ నినో ప్రభావం అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. రైతులకు కల్పించిన అవగాహన నేల ఆరోగ్య యాజమాన్యం వరి పంటకు బదులుగా ఆరుతడి పంటల సాగు ద్వారా పంటల వైవిధ్యీకరణ వ్యవసాయ క్షేత్రాల్లో వ్యవసాయ నీటి కుంటల ప్రాముఖ్యత పశుగ్రాస పంటల సాగు ఆవశ్యకత, ప్రభుత్వ ప్రోత్సాహకాల గురించి మరియు కూరగాయల సాగు



ఉపయోగాలు ఎల్ నినో ప్రభావం వల్ల వ్యవసాయంపై కలిగే ప్రభావాల గురించి అవగాహన ఎల్ నినో పరిస్థితుల కారణంగా వర్షపాతంలో మార్పులు సంభవించడం జరిగింది. కావున వాతావరణానికి అనుకూలంగా, వరి వంటి అధిక నీటి అవసరమయ్యే పంటలకు బదులుగా కరువును తట్టుకోగల మరియు తక్కువ నీటితో సాగు చేయగల ఆరుతడి పంటలైన జొన్న, శనగ, కుసుమ మరియు పొద్దు తిరుగుడు వంటి పంటలను సాగు చేయాలని రైతులకు సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి, వ్యవసాయ విస్తరణ అధికారి, సర్పంచ్, ఉప సర్పంచ్ మరియు రైతులు పాల్గొన్నారు.

సుకన్య సమృద్ధి యోజన పథకం అమలుపై మున్సిపల్ కమిషనర్ అధ్యక్షతన జూమ్ సమావేశం



రామాయంపేట నవంబర్ 12 మహాప్రభ

రామాయంపేట మున్సిపల్ పట్టణంలో సుకన్య సమృద్ధి యోజన పథకం అమలుపై మున్సిపల్ కమిషనర్ గారి ఆధ్వర్యంలో ఈరోజు జూమ్ మీటింగ్ నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో పోస్ట్ ఆఫీస్, ఐసిడిఎస్, ఎడ్యుకేషన్, మున్సిపల్ తదితర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ గారు మాట్లాడుతూ, మున్సిపల్ పట్టణంలో ఉన్న ప్రతి ఒక్కరూ ఈ పథకం గురించి తెలుసుకోవాలని, అర్హులైన ఆడపిల్లలందరికీ ఈ పథకాన్ని చేర్పించాలని అధికారులను ఆదేశించారు.

ఈ పథకం యొక్క ముఖ్య ప్రయోజనాలు:

1. ఎవరు చేరవచ్చు:10 సంవత్సరాల లోపు వయస్సు గల ఆడపిల్ల పేరు మీద తల్లిదండ్రులు / సంరక్షకులు ఖాతా తెరవవచ్చు. ఒక కుటుంబంలో గరిష్టంగా ఇద్దరు ఆడపిల్లలకు వర్తిస్తుంది.
2. తక్కువ మొత్తంతో ప్రారంభం: సంవత్సరానికి కనీసం రూ. 250/- తో ప్రారంభించవచ్చు. గరిష్టంగా సంవత్సరానికి రూ. 1,50,000/- వరకు జమ చేయవచ్చు.
3. అధిక వడ్డీ: ప్రస్తుతం సంవత్సరానికి 8.2% వడ్డీ లభిస్తుంది. ఇది ఇతర పొదుపు పథకాల కంటే ఎక్కువ.
4. పన్ను మినహాయింపు:జమ చేసిన మొత్తానికి 80జ కింద పన్ను మినహాయింపు ఉంటుంది. వచ్చే వడ్డీకి, మెచ్యూరిటీ మొత్తానికి కూడా పన్ను ఉండదు.
5. చదువు కోసం డబ్బు: అమ్మాయి వయస్సు 18 సంవత్సరాలు నిండిన తర్వాత, ఉన్నత చదువు కోసం 50% వరకు డబ్బు తీసుకోవచ్చు.
6. మెచ్యూరిటీ: ఖాతా తెరిచిన 21 సంవత్సరాలకు పూర్తి మొత్తం వస్తుంది. కానీ డబ్బు కేవలం 15 సంవత్సరాలు మాత్రమే కట్టాలి. మిగిలిన 6 సంవత్సరాలు వడ్డీ పెరుగుతూనే ఉంటుంది.

ఈ పథకం గురించి పూర్తి వివరాలు తెలుసుకోవడానికి, ఖాతా తెరవడానికి పోస్ట్ ఆఫీస్ ను గానీ, మున్సిపల్ ఆఫీసును గానీ సంప్రదించాలని కమిషనర్ గారు తెలిపారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన బిఆర్ఎస్ దేవరకొండ నియోజకవర్గం నాయకులు వడ్త్య రమేష్.



డిండి మండలం నవంబర్12 (మహాప్రభ)

డిండి మండలం పెద్ద తండా కి చెందిన కాట్రావత్ ప్రవీణ్ – జ్యోతి.వివాహకార్యకమంలోపాల్గొనివధూవరులను ఆశీర్వదించిన బి ఆర్ ఎస్ దేవరకొం నియోజవర్గం నాయకులు నాయకులు వడ్త్య.రమేష్ఈకార్యక్రమంలో పెద్ద తండా మాజీ సర్పంచ్ కాట్రావత్ వెంకటేష్ నాయక్ ,ఉప సర్పంచ్ విజయ్ నాయక్,అరుణ్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

నేడు దేవరకొండలో శివ సాయి ఫంక్షన్ హాల్ లో ఎమ్మెల్యే పెన్షన్స్ మంజూరు పత్రాలను అందజేస్తారు.



దేవరకొండ డివిజన్ నవంబర్ 12 (మహాప్రభ)

దేవరకొండ పట్టణం శుక్రవారం సాయిశివ ఫంక్షన్ హాల్లో దేవరకొండ మండలం మరియు పట్టణానికి చెందిన వితంతువులు, వికలాంగులు, ఒంటరి మహిళలలు, గీతకార్మికులు మరియు చేనేత కార్మికుల పెన్షన్ దారులకు పెన్షన్ మంజూరు పత్రాలను ఎమ్మెల్యేనేనావత్ బాలునాయక్ అందజేస్తారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, మీడియా మిత్రులు కార్యకర్తలు అందరూ పాల్గొనగలరు

శివప్రసాద్ పట్టు వస్త్ర అలంకరణ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే బాలు నాయక్.



దేవరకొండ డివిజన్ నవంబర్ 12 (మహాప్రభ)

చందంపేట: దేవరకొండ మండలం చింతబావి గ్రామానికి చెందిన నోముల సత్యనారాయణ లింగమ్మ దంపతుల కుమారుడు శివప్రసాద్ నూతన పట్టు వస్త్రాలంకరణ మహోత్సవం పోలేపల్లి గేటు వద్ద ధనలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్ పాల్గొని చిన్నారిని ఆశీర్వదించి, తల్లిదండ్రులకుశుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ చిన్నారి శివప్రసాద్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలు,సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలోదేవరకొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మారుపాకుల సురేష్ గౌడ్, నోముల సైదులు, జర్పుల భధ్యా నాయక్, కిన్నెర హరికృష్ణ, వైఎస్ కరుణాకర్, అంగిరేకుల నాగభూషణం, ముకురోజు రాజు, రామావత్ సాయి కుమార్, ఎలుక జలంధర్ గౌడ్, నోముల రామకృష్ణ యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు పోతంగల్ కలాన్ విద్యార్థులు ఎంపిక

-బాల బాలికలు సత్తా చాటి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు



గాంధారి: నవంబర్12 (మహాప్రభ)

గాంధారి మండలంలోని పోతంగల్ కలాన్ ఉన్నత పాఠశాల విద్యార్థులు హ్యాండ్ బాల్ లో బాల బాలికలు సత్తా చాటి రాష్ట్ర స్థాయికి ఎంపిక య్యారు. విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి, వారికి ఉన్నత స్థాయి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో శారీరక విద్య ఉపాధ్యా యుడు నాగరాజు పనిచేస్తూ విద్యార్థులను ఉన్నత స్థాయికి చేరుస్తున్నారు.నిన్న జరిగిన 17 సంవత్స రాల లోపు బాల బాలికల హ్యాండ్ బాల్ ఎంపిక పోటీలు పోతంగల్ కలాన్ ఉన్నత పాఠశాలలో విజయవంతంగా నిర్వహించడం జరిగిందని పాఠశాల క్రీడల సమాఖ్య కార్యదర్శి శ్రీధర్ తెలిపారు. ఉమ్మడి జిల్లా ఎంపిక పోటీల్లో పోతంగల్ కలాన్ పాఠశాల విద్యార్థులు ఏ.బి. హాలియా, కె. లావణ్య, ఎస్. సాగరిక, బి. జైపాల్ మంచి ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎన్నికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. రంగారావు తెలిపారు.విద్యార్థులను గ్రామ సర్పంచ్ అనుశ్రీ బాల్ రాజు, ఉప సర్పంచ్ శ్రీ సంజీవ్ రెడ్డి, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు శ్రీ మైపాల్ రెడ్డి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, యువకులు అభినందించారు.

ఫుట్‌పాత్ ఆక్రమణదారులపై కఠిన చర్యలు





-తూప్రాన్ మున్సిపల్ కమిషనర్ రమేష్ కుమార్

-రోడ్డు మార్జిన్ మార్కింగ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

-ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే వాహనాలు పోలీసుల స్వాధీనం

-తూప్రాన్ ఎస్ఐ గంగరాజు

తూప్రాన్, నవంబర్12 (మహాప్రభ)

తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని ప్రధాన రహదారిపై ఫుట్‌పాత్‌లు, రోడ్డు మార్జిన్లు మరియు ప్రజా రహదారులను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు తూప్రాన్ మున్సిపల్ కమిషనర్ రమేష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రమేష్ కుమార్ మరియు తూప్రాన్ ఎస్ఐ గంగరాజు మాట్లాడుతూ, ప్రధాన రహదారిపై ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా, పాదచారులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ముఖ్యంగా, తూప్రాన్ ప్రధాన రహదారి వెంబడి రోడ్డు మార్జిన్లను ఇప్పటికే గుర్తించి మార్కింగ్ చేయడం జరిగిందని, సంబంధిత మార్కింగ్ ప్రకారం ప్రతి ఒక్కరూ తమ వ్యాపారాలు, వస్తువులు మరియు ఇతర కార్యకలాపాలను నిర్దేశించిన హద్దులలోనే నిర్వహించాలని సూచించారు. రోడ్డు మార్జిన్ మార్కింగ్‌ను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఉల్లంఘించరాదని స్పష్టం చేశారు. రోడ్డు మార్జిన్ మార్కింగ్‌కు విరుద్ధంగా ఎవరైనా వస్తువులు ఉంచినా, నిర్మాణాలు చేపట్టినా లేదా ఇతరత్రా ఆక్రమణలు, అడ్డంకులు కల్పించినా, అటువంటి సామగ్రిని మరియు ఆక్రమణలను నేరుగా తొలగించి మున్సిపాలిటీ ఆధీనంలోకి తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. అంతేకాకుండా, ప్రధాన రహదారి వెంబడి ఉన్న దుకాణాలకు కొనుగోలు నిమిత్తం వచ్చే వాహనాలు మరియు వీధి వ్యాపారుల వద్దకు వచ్చే వాహనాలు సైతం నిర్దేశించిన రోడ్డు మార్జిన్ మార్కింగ్‌ను తప్పనిసరిగా పాటించాలి. మార్కింగ్‌కు విరుద్ధంగా వాహనాలను నిలిపినా, నిర్దేశిత హద్దులను అతిక్రమించి పార్కింగ్ చేసినా లేదా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించినా, అటువంటి వాహనాలను పోలీస్ శాఖ స్వాధీనం చేసుకొని చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తూప్రాన్ ఎస్ఐ గంగరాజు హెచ్చరించారు. అదేవిధంగా, పాదచారులు నడిచేందుకు కేటాయించిన ఫుట్‌పాత్‌లను వ్యాపార అవసరాలకు వినియోగించడం, రహదారులపై వస్తువులు ఏర్పాటు చేసి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడం వంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు జరిమానాలు విధించడం, అవసరమైతే కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రజా రహదారులు, ఫుట్‌పాత్‌లు ప్రజలందరి సౌకర్యార్థం ఉన్నవని, వాటిని ఆక్రమించడం లేదా రాకపోకలకు అంతరాయం కలిగించడం సహించేది లేదని, ప్రతి ఒక్కరూ మున్సిపాలిటీ మరియు పోలీస్ శాఖ విధించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని మున్సిపల్ కమిషనర్ రమేష్ కుమార్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ ఆఫీసర్, మున్సిపల్ అధికారులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రామాయంపేట మున్సిపాలిటీలో ట్రాఫిక్ సమస్య

సిద్దిపేట రోడ్డులో ఇబ్బందులు పడుతున్న ప్రజలు



రామాయంపేట నవంబర్ 12 మహాప్రభ

రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని సిద్దిపేట రోడ్డులో ఉన్న ఓ షాపింగ్ కాంప్లెక్స్ ముందు నడిరోడ్డుపైనే వాహనాలను ఇష్టానుసారంగా పార్కింగ్ చేయడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆ రోడ్డు నుండి వెళ్లే పెద్ద వాహనాలు, ఆర్టీసీ బస్సులకు , పెద్ద వాహనాలకు దారి లేక ట్రాఫిక్ జామ్ అవుతుంది. అంతేకాకుండా రోడ్డు పక్కన నడవాల్సిన పాదచారులు, పార్కింగ్ వాహనాల వల్ల నడిరోడ్డుపైనే నడవాల్సి వస్తోంది. దీంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంప్లెక్స్ ముందు నడిరోడ్డుపై పార్కింగ్ చేసే వారిపై మున్సిపాలిటీ అధికారులు మరియు రామాయంపేట పోలీస్ స్టేషన్ వారు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే సిద్దిపేట రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. చిన్న వాహనాలపై వెళ్లే వారు ఆ గుంతల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. వెంటనే మున్సిపాలిటీ అధికారులు లేదా ఆర్‌ఆండబి శాఖ అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎస్టీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శులుగా జగదీష్ నాయక్, రాయుడు నాయక్ కి అభినందనలు

–పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ,పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలి:

-అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్ యాదవ్



శేరిలింగంపల్లి,(నవంబర్ 12) మహా ప్రభ

రంగారెడ్డి అర్బన్ జిల్లా ఎస్టీ మోర్చా ప్రధాన కార్యదర్శిగా, కార్యదర్శిగా నియమితులైన జగదీష్ నాయక్ , రాయుడు నాయక్ లకు మర్యాదపూర్వకంగా రవికుమార్ యాదవ్ ని కలిసి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు, భారతీయ జనతా పార్టీ (బీజేపీ) సిద్ధాంతాలను, కేంద్ర ప్రభుత్వ ప్రజా సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్తూ పార్టీ బలోపేతమే ధ్యేయంగా కృషి చేయాలని పిలుపినిచ్చిన... బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ రవికుమార్ యాదవ్, ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జగదీష్ నాయక్ , రాయుడు నాయక్ లకు రవికుమార్ యాదవ్ శాలువా కప్పి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..మాట్లాడుతూ.. పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం, గుర్తింపు లభిస్తాయనడానికి వీరి నియామకాలే నిదర్శనమన్నారు. గిరిజనుల హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం ప్రజల్లో ఉంటూ పార్టీని మరింత పటిష్టం చేయాలని సూచించారు.తమపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వర్తిస్తూ, శేరిలింగంపల్లి నియోజకవర్గంతో పాటు రంగారెడ్డి అర్బన్ జిల్లా వ్యాప్తంగా బీజేపీ విజయానికి సైనికుల్లా పనిచేస్తామని నూతన నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ మోర్చా ఉపాధ్యక్షులు హనుమంత్ నాయక్ పాల్గొన్నారు.

నీటి పొదుపుపై ఇన్వినిటీ స్కూల్ విద్యార్థుల చైతన్య యాత్ర

-ఎల్‌నినో, వాతావరణ మార్పులపై అవగాహన కార్యక్రమం..

-ఇంకుడు గుంతలు, చెక్‌డ్యామ్‌ల ఆవశ్యకతపై ప్రదర్శన



ఎల్లారెడ్డి, నవంబర్ 12, (మహాప్రభ):

వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావాలు, కరువు పరిస్థితులపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ఎల్లారెడ్డిలోని ఇన్వినిటీ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ యాజమాన్యం ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. యాజమాన్యం చొరవతో విద్యార్థులు నీటి సంరక్షణ, కరువు నివారణ చర్యలపై ప్రదర్శనలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా ఇంకుడు గుంతలు, పంటకుంటలు, చెక్‌డ్యామ్‌ల నిర్మాణం ద్వారా వర్షపు నీటిని ఒడిసిపట్టే విధానాలను వివరించారు. తక్కువ నీటితో పండే పంటల సాగును ప్రోత్సహించాలని, నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించాలని సూచించారు. నీటి పొదుపు ప్రాముఖ్యతను వివరిస్తూ విద్యార్థులు పాటలు ఆలపించి సందేశాన్ని అందించారు. వాతావరణ మార్పుల ప్రభావాలను ఎదుర్కోవడంలో నీటి సంరక్షణ కీలకమని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఈ కార్యక్రమం ద్వారా పిలుపునిచ్చారు.

బిజినెస్

స్వల్ప లాభాల్లో స్టాక్ మార్కెట్లు

- గురువారం సానుకూలంగా ముగిసిన దేశీయ మార్కెట్లు
- 31.61 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్
- 44.30 పాయింట్లు ఎగబాకిన నిఫ్టీ
- 81,911.01 వద్ద సెన్సెక్స్ ముగింపు
- 25,299.35 వద్ద స్థిరపడిన నిఫ్టీ
- బ్యాంకింగ్, రియల్టీ షేర్లలో కొనుగోళ్ల జోరు
- నాలుగు శాతం లాభపడిన నిఫ్టీ రియల్టీ సూచీ
- మిడ్, స్మాల్ క్యాప్ సూచీల్లోనూ వృద్ధి



దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం స్వల్ప లాభాలతో ముగిశాయి. రోజంతా తీవ్ర ఒడిదుడుకుల మధ్య కొనసాగిన ట్రేడింగ్‌లో బ్యాంకింగ్, రియల్టీ రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. దీంతో కీలక సూచీలు చివరకు లాభాల బాట పట్టాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 31.61 పాయింట్లు పెరిగి 81,911.01 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 44.30 పాయింట్లు ఎగబాకి 25,299.35 వద్ద స్థిరపడింది. రంగాలవారీగా చూస్తే నిఫ్టీ రియల్టీ ఇండెక్స్ నాలుగు శాతం మేర లాభపడి ఆకర్షణీయమైన పనితీరు కనబరిచింది. బ్యాంకింగ్ రంగ షేర్లలోనూ కొనుగోళ్ల ఆసక్తి కనిపించింది. మరోవైపు నిఫ్టీ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు సైతం లాభాలను నమోదు చేశాయి. అయితే మహీంద్రా అండ్ మహీంద్రా, నెస్లే ఇండియా, పవర్ గ్రిడ్ షేర్లు నష్టాలను చవిచూశాయి. మొత్తంగా స్వల్ప ఒడిదుడుకుల మధ్య సాగిన మార్కెట్లు చివరకు సానుకూలంగా ముగిశాయి.

ఒకేరోజు రూ.1400 తగ్గిన బంగారం ధర..

1.86 లక్షలకు దిగొచ్చిన వెండి..!



దేశీయ మార్కెట్లో బంగారం , వెండి ధరలు దిగి వస్తున్నాయి. అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాలు, వడ్డీరేట్ల పెంపు అంచనాల కారణంగా అంతర్జాతీయ విపణిలో బంగారం, వెండి లోహాల నుంచి పెట్టుబడులు వెనక్కి మళ్లుతున్నాయి. ఆ ప్రభావంతో దేశీయ మార్కెట్‌లో వెండి, బంగారం ధరలు తగ్గుముఖం పట్టాయి. (గురువారం) ఉదయం 10 గంటల సమయంలో హైదరాబాద్ విపణిలో 24 క్యారెట్ల మేలిమి 10 గ్రాముల బంగారం ధర రూ.1,42,350కు చేరింది.క్రితం రోజుతో పోలిస్తే బంగారం ధర ఏకంగా రూ.1400 తగ్గింది. ఇక కిలో వెండి ధర రూ.1,86,550 పలికింది. బుధవారంతో పోలిస్తే వెండి ధర దాదాపు రూ.3 వేలకుపైనే తగ్గడం గమనార్హం. అంతర్జాతీయ విపణిలో స్పాట్ గోల్డ్ ఔన్సు ధర 3,974 డాలర్‌లు, ఔన్సు వెండి ధర 51.48 డాలర్లు పలుకుతున్నాయి. బంగారం ధర ఈ స్థాయిలో దిగిరావడం నవంబర్ 4 తర్వాత మళ్లీ ఇదే తొలిసారి. ఇక మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీలో డిసెంబర్ డెలివరీకి బంగారం 10 గ్రాముల ధర రూ.1.38 లక్షలకు తగ్గింది. కేజీ వెండి ధర రూ.1.82 లక్షలకు దిగి వచ్చింది. అంతర్జాతీయ మార్కెట్‌లో డాలర్ వాల్యూ 19 నెలల గరిష్ఠానికి చేరింది. అంతర్జాతీయంగా బంగారం-వెండి లావాదేవీలు డాలర్లలోనే జరుగుతాయి. డాలర్ విలువ పెరిగినప్పుడు ఇతర దేశాల కరెన్సీల్లో బంగారం, వెండి కొనుగోలు ఖరీదైనదిగా మారుతుంది. దాంతో అంతర్జాతీయంగా డిమాండ్ తగ్గి, స్పాట్ మార్కెట్‌తోపాటు ఫ్యూచర్స్ మార్కెట్‌లోనూ లోహాల ధరలపై ప్రతికూల ప్రభావం పడుతుంది. ఇక వచ్చే నెలలో ఫెడ్ వడ్డీ రేట్లను పెంచవచ్చన్న అంచనాలు కూడా బంగారం, వెండి ధరలపై ఒత్తిడిని పెంచుతున్నాయి.

ఖాతా లేకున్నా నగదు బదిలీ!

- ధ్రువీకరణ, ప్రత్యేక సంకేతాలను పాటించాలని ఆర్బీఐ స్పష్టం చేసింది.
- బ్యాంకు ఖాతా లేని వారికీ డబ్బు పంపే అవకాశం
- నగదు బదిలీపై స్పష్టమైన మార్గదర్శకాలు జారీ
- బ్యాంకు శాఖ ద్వారా గరిష్ఠంగా రూ.50 వేల పంపిణీ
- ఏటీఎం, బిజినెస్ కరస్పాండెంట్ల ద్వారా రూ.5 వేల పరిమితి
- నెలకు రూ.25 వేల వరకు లావాదేవీలకు అవకాశం
- ఖాతాదారులకు, ఖాతాలు లేనివారికి వేర్వేరు పరిమితులు
- కేవైసీ, మొబైల్ ధ్రువీకరణ తప్పనిసరి
- ప్రత్యేక సంకేతాల ఆధారంగా నగదు బదిలీ



బ్యాంకు ఖాతా లేకపోయినా ఇతరుల బ్యాంకు ఖాతాల్లోకి నగదు పంపేందుకు అవకాశం కల్పిస్తూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసింది. నగదు బదిలీ విధానాన్ని సులభతరం చేయడంతోపాటు లావాదేవీల భద్రతకు ప్రాధాన్యమిస్తూ వివిధ మార్గాల్లో పంపగలిగే మొత్తాలపై పరిమితులు విధించింది. బ్యాంకు శాఖ ద్వారా ఒక లావాదేవీలో గరిష్ఠంగా రూ.50 వేల వరకు నగదు పంపవచ్చు. ఏటీఎం లేదా బిజినెస్ కరస్పాండెంట్ల ద్వారా ఒకసారి రూ.5 వేల చొప్పున, నెలకు గరిష్ఠంగా రూ.25 వేల వరకు బదిలీ చేసుకునే అవకాశం కల్పించింది. అదేవిధంగా బ్యాంకు ఖాతా లేని వ్యక్తులకు నగదు పంపే సందర్భంలో ఒక లావాదేవీకి రూ.10 వేలు, నెలకు రూ.25 వేల పరిమితిని నిర్ణయించింది. ఈ విధానంలో నగదు పంపేవారి వివరాలను ధ్రువీకరించడం తప్పనిసరి చేసింది. ఇందుకోసం కేవైసీ నిబంధనలు, మొబైల్ నంబర్ ధ్రువీకరణతోపాటు ప్రత్యేక సంకేతాల విధానాన్ని పాటించాలని స్పష్టం చేసింది. ఈ నిబంధనలతో బ్యాంకు ఖాతాలు లేని వారు కూడా ఇతరులకు సులభంగా నగదు పంపే అవకాశం లభించనుంది.

స్పోర్ట్స్

ఐపీఎల్ వేలానికి బంగ్లా ఆటగాళ్లు..
వివాదాల తర్వాత మెత్తబడ్డ బీసీసీఐ!

- ఐపీఎల్ వేలంలోకి బంగ్లా ఆటగాళ్లు.. బీసీసీఐ గ్రీన్ సిగ్నల్
- ముస్తాఫిజుర్‌తో పాటు మరో ఆరుగురు క్రికెటర్ల రిజిస్ట్రేషన్
- 10 నెలల క్రితం ముస్తాఫిజుర్‌ను విడుదల చేయించిన బీసీసీఐ
- భారత్‌లో టీ20 ప్రపంచకప్ ఆడకుండా తప్పుకున్న బంగ్లాదేశ్
- తాజా నిర్ణయంతో మెరుగుపడనున్న ఇరు దేశాల క్రికెట్ సంబంధాలు



భారత్, బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డుల మధ్య నెలకొన్న వివాదాలకు తెరపడే సూచనలు కనిపిస్తున్నాయి. రాబోయే ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) మినీ వేలంలో పాల్గొనేందుకు బంగ్లాదేశ్ ఆటగాళ్లను అనుమతించాలని బీసీసీఐ నిర్ణయించింది. ఈ పరిణామం ఇరు దేశాల క్రికెట్ సంబంధాల పునరుద్ధరణలో కీలక ముందడుగుగా భావిస్తున్నారు. డిసెంబర్ 16న జరగనున్న ఈ వేలం కోసం బంగ్లా క్రికెట్ బోర్డు (బీసీబీ)కు బీసీసీఐ అధికారికంగా సమాచారం పంపింది. దీంతో స్టార్ పేసర్ ముస్తాఫిజుర్ రెహ్మాన్‌తో పాటు నహీద్ రాణా, రిషద్ హొస్సేన్, హసన్ మహమూద్, తౌహిద్ హృదయ్, తస్కిన్ అహ్మద్, షోరిఫుల్ ఇస్లాం వంటి ఆటగాళ్లు వేలంలో తమ పేర్లను నమోదు చేసుకుంటున్నారు. సుమారు 10 నెలల క్రితం కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) జట్టు నుంచి ముస్తాఫిజుర్‌ను బీసీసీఐ విడుదల చేయించడం తీవ్ర వివాదాస్పదమైన విషయం తెలిసిందే. గతేడాది డిసెంబర్‌లో బంగ్లాదేశ్‌లో హిందూ సమాజంపై జరిగిన హింసాత్మక ఘటనల నేపథ్యంలో బీసీసీఐ ఈ కఠిన నిర్ణయం తీసుకుంది. ఆ సమయంలో ముస్తాఫిజుర్ ఐపీఎల్ ఆడటంపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. అంతకుముందు జరిగిన మినీ వేలంలో రికార్డు స్థాయిలో రూ. 9.20 కోట్లకు కేకేఆర్ అతడిని కొనుగోలు చేసింది. ఇది ఐపీఎల్ చరిత్రలో ఒక బంగ్లాదేశ్ ఆటగాడికి లభించిన అత్యధిక ధర కావడం గమనార్హం. ముస్తాఫిజుర్ విడుదలపై బంగ్లా క్రికెట్ బోర్డు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. భద్రతా కారణాలను చూపుతూ 2026 టీ20 ప్రపంచకప్ కోసం తమ జట్టును భారత్‌కు పంపేది లేదని స్పష్టం చేసింది. తమ మ్యాచ్‌లను సహ-ఆతిథ్య దేశమైన శ్రీలంకకు తరలించాలని అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ)ని డిమాండ్ చేసింది. అయితే, ఐసీసీ ఈ డిమాండ్‌ను తిరస్కరించడంతో బంగ్లాదేశ్ టోర్నమెంట్ నుంచి వైదొలగింది. వారి స్థానంలో స్కాట్లాండ్ జట్టుకు అవకాశం దక్కింది. ఇన్ని పరిణామాల తర్వాత ఇప్పుడు ఐపీఎల్ వేలానికి బంగ్లా ఆటగాళ్లను ఆహ్వానించడం ఇరు దేశాల క్రికెట్ సంబంధాల బలోపేతానికి దోహదపడుతుందని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

సెహ్వాగ్ తనయుడికి కోహ్లీ చిన్నప్పుడు ఇచ్చిన సలహా ఇదే..


- వైరల్ అవుతున్న ఆర్యవీర్ పాత ఇంటర్వ్యూ వీడియో!
- అండర్-19 ఆసియా కప్‌లో యూఏఈపై 160 పరుగులు చేసిన ఆర్యవీర్ సెహ్వాగ్
- ఈ ఇన్నింగ్స్‌తో సెమీఫైనల్‌కు అర్హత సాధించిన భారత జట్టు
- చిన్నప్పుడు కోహ్లీని ఇంటర్వ్యూ చేసిన ఆర్యవీర్ పాత వీడియో వైరల్



భారత మాజీ డాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ తనయుడు ఆర్యవీర్ సెహ్వాగ్, అండర్-19 ఆసియా కప్‌లో అద్భుత శతకంతో ఒక్కసారిగా వెలుగులోకి వచ్చాడు. యూఏఈపై అతను 160 పరుగుల భారీ ఇన్నింగ్స్ ఆడటంతో సుమారు పదేళ్ల క్రితం చిన్నారిగా విరాట్ కోహ్లీని ఇంటర్వ్యూ చేసిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఒమన్‌లోని అల్ అమీరత్ వేదికగా యూఏఈతో జరిగిన కీలక మ్యాచ్‌లో ఆర్యవీర్ సెహ్వాగ్ అద్భుత బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. మొదట నిలదొక్కుకోవడానికి సమయం తీసుకున్నప్పటికీ, ఆ తర్వాత చెలరేగి ఆడాడు. మొత్తం 168 బంతుల్లో 17 ఫోర్లు, 7 సిక్సర్లతో 160 పరుగులు సాధించాడు. మ్యాచ్ అనంతరం ఆర్యవీర్ మాట్లాడుతూ.. తన తండ్రి వీరేంద్ర సెహ్వాగ్‌కు భారీ సెంచరీ చేస్తానని మాటిచ్చినట్లు తెలిపాడు. "మా నాన్నకు ఎప్పుడూ భారీ శతకాలంటేనే ఇష్టం. సెంచరీ దాటిన స్కోర్లనే ఆయన గౌరవిస్తారు. అందుకే ఆయనకు ఓ పెద్ద వంద కొడతానని చెప్పాను. ఈ రోజు ఆ మాట నిలబెట్టుకోవడం చాలా సంతోషంగా ఉంది" అని వివరించాడు. ఈ సెంచరీ నేపథ్యంలో 2017లో 'స్టార్ స్పోర్ట్స్' ప్రసారం చేసిన ఓ పాత వీడియో క్లిప్ ట్రెండింగ్‌లోకి వచ్చింది. అప్పుడు తొమ్మిదేళ్ల బాలుడిగా ఉన్న ఆర్యవీర్.. అప్పటి టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీని ఇంటర్వ్యూ చేశాడు. "మీరు మా నాన్నను మొదటిసారి ఎప్పుడు కలిశారు?" అని ఆర్యవీర్ అమాయకంగా అడగగా, ఢిల్లీలో అండర్-17 క్రికెట్ ఆడుతున్నప్పుడు కలిశానని కోహ్లీ గుర్తుచేసుకున్నాడు. ఈ సందర్భంగా కోహ్లీ ఆర్యవీర్‌కు ఒక కీలక సలహా ఇచ్చాడు. "ఎప్పుడూ ఒకటే చెబుతాను. నేను ఎదైనా చేయగలనని నిన్ను నీవ్వు నమ్ము. ఎల్లప్పుడూ పాజిటివ్‌గా ఆలోచించు" అని అన్నాడు. ప్రస్తుతం ఆర్యవీర్ ఆడుతున్న తీరుకు అప్పుడు కోహ్లీ ఇచ్చిన సలహా బాగానే పనిచేస్తున్నట్లు అనిపిస్తోంది. ఒకప్పుడు కోహ్లీని ఆరాధనగా చూసిన చిన్నారి, ఇప్పుడు జూనియర్ స్థాయిలో తానే సత్తా చాటుతుండటం క్రికెట్ అభిమానులకు ఆసక్తి కలిగిస్తోంది. ఈ టోర్నీ సెమీఫైనల్‌లో భారత జట్టు ఆఫ్ఘనిస్థాన్‌తో తలపడనుంది.

21 సిక్సర్లతో విరుచుకుపడ్డ కివీస్ బ్యాటర్..

- లిస్ట్-ఏ క్రికెట్‌లో రికార్డు ఇన్నింగ్స్
- ఫోర్డ్ ట్రోఫీలో న్యూజిలాండ్ బ్యాటర్ బెవాన్ జాకబ్స్ విధ్వంసం
- 137 బంతుల్లో అజేయంగా 202 పరుగులు
- ఇందులో 21 సిక్సర్లు ఉండడం విశేషం
- లిస్ట్-ఏ ఇన్నింగ్స్‌లో అత్యధిక సిక్సర్లు బాదిన న్యూజిలాండ్ బ్యాటర్
- ప్రపంచ రికార్డుకు రెండు సిక్సర్ల దూరంలో నిలిచిన వైనం




న్యూజిలాండ్ యువ బ్యాటర్ బెవాన్ జాకబ్స్ దేశవాళీ క్రికెట్‌లో విధ్వంసకర ఇన్నింగ్స్‌తో చరిత్ర సృష్టించాడు. ఫోర్డ్ ట్రోఫీలో భాగంగా గురువారం ఆక్లాండ్ తరఫున ఒటాగోతో జరిగిన మ్యాచ్‌లో కేవలం 137 బంతుల్లోనే అజేయంగా 202 పరుగులు సాధించాడు. ఇందులో ఏకంగా 21 సిక్సర్లు బాదాడు. దీంతో లిస్ట్-ఏ క్రికెట్‌లో ఒక ఇన్నింగ్స్‌లో అత్యధిక సిక్సర్లు కొట్టిన న్యూజిలాండ్ బ్యాటర్‌గా రికార్డు నెలకొల్పాడు. ప్రపంచ రికార్డుకు మాత్రం మరో రెండు సిక్సర్ల దూరంలో నిలిచాడు. నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు దిగిన 28 ఏళ్ల జాకబ్స్.. తన తొలి లిస్ట్-ఏ సెంచరీని డబుల్ సెంచరీగా మలిచాడు. 137 బంతుల్లోనే 200 పరుగుల మైలురాయిని అందుకున్నాడు. అతడి ఇన్నింగ్స్‌లో ఏడు ఫోర్లు, 21 సిక్సర్లు ఉన్నాయి. ఈ ప్రదర్శనతో న్యూజిలాండ్ తరఫున లిస్ట్-ఏ ఇన్నింగ్స్‌లో అత్యధిక సిక్సర్లు బాదిన ఆటగాడిగా నిలిచాడు. లిస్ట్-ఏ క్రికెట్‌లో ఒక ఇన్నింగ్స్‌లో అత్యధిక సిక్సర్లు బాదిన ప్రపంచ రికార్డు ఆస్ట్రేలియాకు చెందిన డార్సీ షార్ట్ పేరిట ఉంది. 2018లో సిడ్నీలో వెస్ట్రన్ ఆస్ట్రేలియా తరఫున క్వీన్స్‌లాండ్‌పై ఆడుతూ 148 బంతుల్లో 257 పరుగులు చేసిన షార్ట్.. 23 సిక్సర్లు బాదాడు. జాకబ్స్ 21 సిక్సర్లతో ఆ రికార్డుకు చేరువయ్యాడు. జాకబ్స్ అజేయంగా చేసిన 202 పరుగులు ఫోర్డ్ ట్రోఫీలో ఆక్లాండ్ ఏసెస్ తరఫున అత్యధిక వ్యక్తిగత స్కోరుగా నమోదయ్యాయి. ఈ టోర్నీలో డబుల్ సెంచరీ సాధించిన మూడో బ్యాటర్‌గా కూడా నిలిచాడు. లిస్ట్-ఏ క్రికెట్‌లో డబుల్ సెంచరీ చేసిన నాలుగో న్యూజిలాండ్ బ్యాటర్‌గా రికార్డులకెక్కాడు. ఇంతకుముందు జేమీ హౌ (2012), మార్టిన్ గప్టిల్ (2015), చాడ్ బౌస్ (2024) ఈ ఘనత సాధించారు.

ఇడుపు కాయితం' టీజర్ వచ్చేసింది..

డిసెంబర్ 11న గ్రాండ్‌గా రిలీజ్!




టాలీవుడ్ వర్గాల్లో ప్రస్తుతం ఆసక్తికరంగా చర్చనీయాంశంగా మారిన చిత్రం 'ఇడుపు కాయితం'. వైవిధ్యమైన కథలతో ప్రేక్షకులను అలరించే టాలెంటెడ్ హీరో ప్రియదర్శి పులికొండ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ సినిమా నుంచి తాజాగా విడుదలైన టీజర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటూ సినిమాపై అంచనాలను తారాస్థాయికి చేర్చింది.తెలంగాణ మట్టి వాసన ఉట్టిపడేలా, పల్లెటూరి సంప్రదాయాలు మరియు కుటుంబ భావోద్వేగాల నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కుతోంది. ఇందులో ప్రియదర్శి సరసన నాగదుర్గ కథానాయికగా నటిస్తూ ఈ చిత్రంతో వెండితెరకు పరిచయమవుతున్నారు. వంశీరెడ్డి దొండపాటి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థలు సుకుమార్ రైటింగ్స్ మరియు బన్నీ వాస్ వర్క్స్ సంయుక్తంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి సుకుమార్, బన్నీ వాస్, తబితా సుకుమార్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఇక ఈ చిత్రానికి సురేష్ బొబ్బిలి అందిస్తున్న సంగీతం అదనపు ఆకర్షణగా నిలుస్తోంది. ఇప్పటికే విడుదలైన 'శ్రీలత', 'గడప', 'బరాత్ బీట్' పాటలు శ్రోతలను విపరీతంగా అలరించగా, తాజాగా విడుదలైన టీజర్ సినిమాపై మరింత హైప్‌ను క్రియేట్ చేసింది. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసుకున్న ఈ చిత్రం డిసెంబరు 11న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ప్రస్తుతం యూట్యూబ్‌లో ట్రెండ్ అవుతున్న ఈ చిత్ర టీజర్ సినిమాపై అంచనాలను మరింత పెంచేసింది.



అల్లరి నరేశ్ 'ఆల్కహాల్'

సినిమా రిలీజ్ డేట్ ఫిక్స్..

డిసెంబర్ 18న గ్రాండ్ రిలీజ్!



వైవిధ్యమైన కథలతో ప్రేక్షకులను అలరిస్తూ వస్తున్న కామెడీ కింగ్, హీరో అల్లరి నరేశ్ నటిస్తున్న తాజా సంచలన చిత్రం 'ఆల్కహాల్' . 'ఫ్యామిలీ డ్రామా' వంటి విభిన్న చిత్రంతో మంచి గుర్తింపు తెచ్చుకున్న టాలెంటెడ్ డైరెక్టర్ మెహర్ తేజ్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. ఎట్టకేలకు ప్రేక్షకులను అలరించేందుకు ఈ చిత్రం సిద్ధమైంది. ఈ సినిమాను డిసెంబర్ 18వ తేదీన ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు.ఈ చిత్రంలో అల్లరి నరేశ్ సరసన రుహానీ శర్మ హీరోయిన్‌గా నటిస్తుండగా, సోషల్ మీడియా సెన్సేషన్ నిహారిక ఎన్ఎం మరియు కమెడియన్ సత్య తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థలు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ , ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శ్రీకరా స్టూడియోస్ సమర్పిస్తున్న ఈ సినిమాకు సంబంధించిన ప్రచార చిత్రాలు ఇప్పటికే సినిమాపై భారీ అంచనాలను పెంచేశాయి. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా టీజర్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. ముఖ్యంగా టీజర్‌లో అల్లరి నరేశ్ మరియు కమెడియన్ సత్య మధ్య వచ్చే సంభాషణలు, డైరెక్టర్ మెహర్ తేజ్ మార్క్ కామెడీ టైమింగ్, పంచ్ డైలాగ్స్ సినిమాపై క్యూరియాసిటీని క్రియేట్ చేశాయి. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ వైవిధ్యమైన చిత్రాన్ని డిసెంబర్ 18న థియేటర్లలో చూడటానికి అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



'టాక్సిక్' రిజల్ట్ నన్ను కుంగదీసింది :

బాలీవుడ్ ప్రముఖ నటి కియారా అద్వానీ ఇటీవల నటించిన 'టాక్సిక్' సినిమా విడుదల సమయంలో తాను ఎదుర్కొన్న అనుభవాలు, భావోద్వేగాల గురించి తాజాగా ఓపెన్ అయ్యారు. సినిమా మొదటి రోజు వచ్చిన భారీ ఓపెనింగ్ కలెక్షన్లను చూసి అంతా సంతోషించినప్పటికీ, ఆ తర్వాత సినిమా ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోవడం తన బృందానికి ఎంతో బాధ కలిగించిందని ఆమె తెలిపారు. ముఖ్యంగా ఆ తొలి వారాంతంలో ఈ పరాజయం తనను ఎంతగానో కుంగదీసిందని, ఆ క్షణాలు తనను తీవ్ర నిరాశకు గురిచేశాయని కియారా పేర్కొన్నారు. అయితే, తన సాధారణ కంఫర్ట్ జోన్‌ను పూర్తిగా పక్కన పెట్టి, కెరీర్‌లోనే ఎంతో సవాల్‌తో కూడిన ఒక విభిన్నమైన పాత్రను పోషించానని, ఆ పాత్రకు మాత్రం ప్రేక్షకుల నుంచి మంచి ప్రశంసలు దక్కడం తనకు కాస్త ఊరటనిచ్చిందని చెప్పారు.ఈ సందర్భంలో పెళ్లి తర్వాత సినిమాలలో రొమాంటిక్ సన్నివేశాలలో నటించడంపై వస్తున్న ట్రోల్స్, విమర్శల గురించి కూడా ఆమె స్పందించారు. తన భర్త, ప్రముఖ నటుడు సిద్ధార్థ్ మల్హోత్రా ఈ విషయంలో ఎంతో మెచ్యూరిడ్‌గా వ్యవహరించారని కియారా కొనియాడారు. పెళ్లి తర్వాత రొమాంటిక్ సీన్లలో నటించడంపై సిద్ధార్థ్ ఎలాంటి అభ్యంతరం తెలపకపోగా, ఆ విషయాన్ని అసలు పట్టించుకోలేదని, ఎప్పుడూ తనతో ఆ గురించి ప్రస్తావించనేలేదని ఆమె వెల్లడించారు. తమ వివాహం తర్వాత ఈ అంశంపై ఇద్దరూ ఎప్పుడూ మాట్లాడుకోలేదని, ఆయనకు దీనిపై ఎలాంటి నెగెటివ్ అభిప్రాయం లేదని స్పష్టం చేశారు.

నితిన్ 'అలియాస్ రుక్మిణి' షూటింగ్ పూర్తి..

- డిసెంబర్ 4న గ్రాండ్ రిలీజ్!



టాలీవుడ్ ఎనర్జిటిక్ హీరో నితిన్ నటిస్తున్న తాజా సినిమా 'అలియాస్ రుక్మిణి' . విభిన్నమైన కథాంశంతో తెరకెక్కుతున్న ఈ సినిమా షూటింగ్ తాజాగా విజయవంతంగా పూర్తయింది. ఈ చిత్రానికి 'దండోరా' ఫేమ్ మురళీకాంత్ దేవసోత్ దర్శకత్వం వహిస్తుండగా, 'యూనానిమస్ ప్రొడక్షన్స్' బ్యానర్‌పై నేచురల్ స్టార్ నాని సోదరి దీప్తి గంటా నిర్మిస్తున్నారు. అలాగే ఈ చిత్రాన్ని నేచురల్ స్టార్ నాని స్వయంగా సమర్పిస్తుండటం విశేషం.ఈ చిత్రంలో నితిన్ సరసన ఆఫియా సయ్యద్ హీరోయిన్‌గా నటిస్తుండగా, ప్రముఖ నటులు సాయికుమార్, హర్షవర్ధన్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఇందులో నితిన్ 'కృష్ణ' అనే యువకుడి పాత్రలో సరికొత్త, అత్యంత యంగ్ అండ్ స్టైలిష్ మేకోవర్‌లో అలరించనున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ వీడియోలు మరియు 'రుక్కు రుక్కు రుక్మిణి' సాంగ్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటూ సినిమాపై భారీ అంచనాలను పెంచేశాయి. ఇక షూటింగ్ పూర్తి కావడంతో చిత్ర యూనిట్ పోస్ట్ ప్రొడక్షన్ పనులను శరవేగంగా వేగవంతం చేసింది. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసుకుని ఈ అందమైన ప్రేమకథా చిత్రం డిసెంబర్ 4వ తేదీన ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది.

బాక్సాఫీస్ వద్ద 'రామాయణం' సునామీ.

-వారం రోజుల్లోనే రూ.934 కోట్ల వసూళ్లు!



భారతీయ చలనచిత్ర చరిత్రలో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిన పౌరాణిక చిత్రం 'రామాయణం' (ఇంటర్నేషనల్ 1) బాక్సాఫీస్ వద్ద సరికొత్త సంచలనాలు సృష్టిస్తోంది. నితేష్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో రణ్‌బీర్ కపూర్ రాముడిగా, సాయి పల్లవి సీతాదేవిగా, యశ్ రావణాసురుడిగా నటిస్తూ ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తున్నారు. భారీ అంచనాల నడుమ దీపావళి కానుకగా విడుదలైన ఈ సినిమా, బాక్సాఫీస్ వద్ద ఏమాత్రం జోరు తగ్గించకుండా కలెక్షన్ల వర్షం కురిపిస్తోంది.ట్రేడ్ వర్గాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం, ఈ సినిమా విడుదలైన కేవలం 7 రోజుల్లోనే (వారం రోజుల్లో) ప్రపంచవ్యాప్తంగా ఏకంగా రూ. 934.55 కోట్ల గ్రాస్ వసూళ్లను రాబట్టి అరుదైన మైలురాయిని చేరుకుంది. ఇందులో ఇండియా గ్రాస్ రూ. 611.05 కోట్లు (నెట్ రూ. 511.10 కోట్లు) ఉండగా, ఓవర్సీస్ మార్కెట్‌లో రూ. 323.50 కోట్లకు పైగా వసూలు చేయడం విశేషం. వర్కింగ్ డేస్‌లోనూ థియేటర్ల వద్ద ప్రేక్షకుల తాకిడి తగ్గకపోవడంతో, ఈ చిత్రం అతి త్వరలోనే ప్రతిష్టాత్మకమైన రూ. 1000 కోట్ల క్లబ్లోకి అడుగుపెట్టడానికి సిద్ధమవుతోంది. బాలీవుడ్‌తో పాటు తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లోనూ ఈ చిత్రానికి ప్రేక్షకులు బ్రహ్మరథం పడుతున్నారు. పౌరాణిక చిత్రాల చరిత్రలో బాక్సాఫీస్ రికార్డులను తిరగరాస్తూ 'రామాయణం' సృష్టిస్తున్న ఈ ప్రభంజనం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది.!

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com